


నిందితులను తరలిస్తున్న పోలీసులు



ఇద్దరు పెళ్లాలు.. ఏడుగురు పిల్లలు..!

సాకలేక.. దొంగగా మారిన పెయింటర్



ఇద్దరు భార్యలు.. ఏడుగురు పిల్లలు..! చేసేది పెయింటింగ్ పని. ఆ డబ్బుతో సంసారం గడవడం భారంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరైనా 'ఇంతమందిని సాకేదెట్ల..? యాటికైనా దొంగతనాలకు పోవాల్సిందే..' అంటుంటారు..! దొంగ అవతారం ఎత్తాడు. కానీ షేక్ ఖాజా వీరా అట్ల అనలేదు.. కానీ చేశాడు..! ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలోనూ చొరబడ్డాడు. తాళం వేసిన ఇళ్లను దోచిపడేశాడు. మూడు రాష్ట్రాలలో అతనిపై ఏకంగా 41 దొంగతనం కేసులు నమోదయ్యాయి. మొదట్లో ఒంటరిగా దొంగతనాలు చేయడం ప్రారంభించిన ఖాజా.. ఆ తరువాత మరో ఇద్దరిని కలుపుకున్నాడు. అనంతపురం సీసీఎస్, రూరల్ పోలీసులు ఆ ముగ్గురినీ పట్టుకున్నారు. వారి నుంచి 31 తులాల బంగారు ఆభరణాలు, కారు, బైకను స్వాధీనం చేసుకున్నారు. (వివరాలు 7లో..)



హంద్రీనీవాకు కళ!

రూ. 936.70 కోట్లతో ప్రధాన కాలువ లైనింగ్ పనులు

నిధులు మంజూరు చేస్తూ జీవో జారీ

అరటి సాగు అదుర్స్

కూడేరు మండలంలో పెరిగిన విస్తీర్ణం

అన్నదాతల జాగ్రత్తలతో అధిక దిగుబడులు

పండిన పంట విదేశాలకు ఎగుమతి

6





వైసీపీ మండల కన్వీనరు మోహన్

మోహన రాగం.. నిధులు మాయం..!

కూటమి ప్రభుత్వంలో వైసీపీ నాయకుడి హవా..



మోహన్ ఇంటి వద్ద ఉన్న పంచాయతీ శానిటేషన్ ట్రాక్టరు

ఎమ్మెల్యే గుమ్మనూరు పేరు వాడుకుని దందాలు

- బదిలీలు, డెప్యుటేషన్‌లు, బిల్లులు.. ఆయన కనుసన్నల్లోనే..
- పంచాయతీ ట్రాక్టర్‌ను సొంతానికి వాడుతున్న ఘనుడు
- సంపూర్ణ సహకారం అందిస్తున్న కొందరు అధికారులు


గుంతకల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆయన వైసీపీకి మండల కన్వీనరు. పైగా ఎంపీపీ భర్త. అధికారం ఉండటంతో అప్పట్లో చక్రం తిప్పాడు. కానీ చిత్రంగా.. ప్రభుత్వం మారినా ఆయన హవా కొనసాగుతోంది. పోలీసులు, మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ ఉద్యోగుల బదిలీలు, డెప్యుటేషన్‌లు, ఉన్నచోటే కొనసాగడం.. ఇలా.. ఏదైనా సరే.. ఆయన ప్రమేయం తప్పనిసరి అన్నట్లుగా పరిస్థితి తయారైంది. పంచాయతీ బిల్లులు పెట్టాలంటే ఆయను ఆశ్రయించాల్సిందే. మండల ఇంజనీరు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరు, హార్టికల్చర్ అధికారులు, మండల అభివృద్ధి అధికారి సైతం ఆయనకు దాసోహమయ్యారనే ఆరోపణలు వస్తున్నాయి. పనిచేయకుండానే రూ.లక్షల్లో బిల్లులు డ్రాచేసిన ఘనుడు ఆయన. పంచాయతీ శానిటేషన్ ట్రాక్టరును ఇంటి పనులకు వాడుతున్నాడు. బదిలీ అయిన అధికారులను ఇక్కడికే డెప్యుటేషన్‌పై తేవడం, పాత తేదీలతో వారిచేత ఎం-బుక్ చేయించి బిల్లులు కాజేయడంలో సిద్ధహస్తుడు. ఎమ్మెల్యే సామాజికవర్గానికి చెందిన వాడినని చెప్పుకుంటూ మండల పరిషత్‌లో చక్రం తిప్పుతున్నాడు. పేరు మోహన్ రావు..! టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చినా.. వైసీపీ నాయకుడి పెత్తనం ఏమిటని టీడీపీ శ్రేణులు మండిపడుతున్నాయి.

నిధుల స్వాహా


వైసీపీ హయాంలో మండల గ్రాంట్లను స్వాహా చేశాడు. వివిధ పంచాయతీల్లో శానిటేషన్, గ్రావెల్ రోడ్ ఫార్మేషన్, రోడ్లపై ఎర్రమన్ను చల్లడం, వాటర్ సప్లై, బోర్‌వెల్ స్పేర్స్ కొనుగోలు, గొట్టపు బావుల తవ్వకం.. పలు రకాల పనులను చేయకుండానే.. వాటి పేరుతో 15వ ఆర్థిక సంఘ నిధులను కాజేశాడు. తన పేరిటే కాదు, తల్లి శంకరమ్మ, సోదరుడు సురేంద్ర పేరిట నెలగొడ, వెంకటాంపల్లి, గుర్రబ్బాడు, నాగసముద్రం, వైటీ చెరువు, చింతలాంపల్లి తదితర గ్రామాల్లో పనులు చేసినట్లు బిల్లులు పెట్టి రూ.52 లక్షల పీఎఫ్ఎంఎస్ నిధులు, రూ.15.84 లక్షల సీఎఫ్ఎంఎస్ నిధులను పక్కదారి పట్టించాడు. నీరు పడని బోర్లకు కేసింగ్, మోటారును ఏర్పాటు చేయకపోయినా, రూ.లక్ష వరకూ బిల్లులు డ్రా చేశాడు. వైసీపీ హయాంలో పాతకొత్తచెరువు పంచాయతీ పారిశుధ్య పనికి కేటాయించిన ట్రాక్టరును తన స్వగ్రామం నెలగొండకు తీసుకెళ్లి వ్యవసాయ పనులకు వినియోగించుకుంటున్నాడంటే.. వ్యవహారం ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు.

బదిలీల్లో మోహనరాగం

పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఎంపీడీఓ, రెవెన్యూ కార్యాలయాల సిబ్బంది, అధికారుల బదిలీల్లో ఇప్పటికీ ఆయనదే హవా..! ఓ సీఐ, ఎస్ఐని గుంతకల్లుకు రప్పించాడని, ఓ రెవెన్యూ అధికారి బదిలీ జరక్కుండా అడ్డుకుంటున్నాడని ప్రచారం ఉంది. గుంతకల్లు మండల ఇంజనీరు ఓబులేసు లాంగ్ స్టాండింగ్‌లో గుత్తికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గుత్తి నుంచి గుంతకల్లుకు బదిలీపై వచ్చిన మల్లేష్ నాయక్‌ను మళ్లీ డెప్యుటేషన్‌పై గుత్తికి పంపారు. ఓబులేసును గుంతకల్లుకు డెప్యుటేషన్‌పై తెచ్చారు. ఇందులోనూ ఆయన ప్రమేయమే ఉందని సమాచారం. మండలంలో పనులు చేయకుండానే డబ్బులు డ్రా చేసేందుకు ఈ డెప్యుటేషన్ వ్యవహారం జరుగుతోందనేది బహిరంగ రహస్యం. గుంతకల్లులో ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఇంజనీరుగా పనిచేసిన దత్తు.. వైసీపీ హయాంలో భారీ అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. వర్కు వ్యాల్యూపై 2 శాతం ఇస్తే చాలు.. పాత తేదీలతో ఆయన ఎంబుక్ రికార్డు చేసేస్తారని ఆరోపణలున్నాయి. ఆయన పేరిట చేసిన ఎం-బుక్‌లకు బిల్లులను చెల్లించడం లేదని ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి ధ్రువీకరించారు. వాల్మీకి సామాజికవర్గానికి చెందిన మోహన్‌రావు.. తనకు ఎమ్మెల్యే జయరాం మద్దతు ఉందని ప్రచారం చేసుకుంటున్నాడు. అన్ని శాఖల్లో చక్రం తిప్పుతున్నాడు. దీంతో టీడీపీ నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీలో ఉంటూనే.. అవసరానికి ఎమ్మెల్యే ఆఫీసుచుట్టూ చక్కర్లు కొట్టడం ఆయనకు పరిపాటి. వైసీపీ హయాంలో టీడీపీ సర్పంచులున్న పంచాయతీలకు బిల్లులు, సర్పంచు గౌరవ వేతనం కూడా రాకుండా చేశారు. టీడీపీ కూటమి పాలనలో వైసీపీ ప్రజాప్రతినిధులకూ బిల్లులు పాస్ చేయిస్తున్నాడు.



Payment Voucher Details



Payment Voucher Details

శంకరమ్మ, సురేంద్ర, మల్లికార్జున పేరిట గత ఏడాది, ఈ ఏడాది రిలీజైన పేమెంట్ ఓచర్లు

దత్తు ఎం-బుక్‌లను నిలువరించాం..

ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి జేఈగా పనిచేసిన దత్తు చేసిన బిల్లులు ఫేక్ అని తెలిసి, అతడు చేసిన రికార్డును అనుమతించడం లేదని ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి తెలిపారు. వైసీపీ నాయకుడు మోహన్ అవినీతి వ్యవహారాలపై పొంతనలేని సమాధానాలిచ్చారు. మండల ఇంజనీరును, ఈఓఆర్డీని అడగండంటూ చేతులు దులిపేసుకున్నారు. పంచాయతీ ట్రాక్టరును సొంతానికి వాడుతున్న విషయంలో వివరణ కోరడానికి ఈఓఆర్డీ నాగభూషణంకు పలుమార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. వైసీపీ నాయకుడి వ్యవహారంలో అన్ని వేళ్లూ ఎంపీడీఓ వైపే చూపుతున్నాయి. ఎమ్మెల్యే దృష్టిలో లేని పనుల బిల్లులను ఎంపీడీఓ సహకారంతోనే వైసీపీ నాయకుడు డ్రాచేశాడనే ఆరోపణలు ఉన్నాయి. గడచిన ఐదేళ్లలో మండలంలోని ఏ పంచాయతీకీ చేతి పంపు విడి భాగాలను ఇవ్వలేదు. కానీ వాటిని కొన్నట్లు రూ.2.80 లక్షల బిల్లులు పెట్టారు.

ఎంపీపీ అవినీతి, అక్రమాలపై నాలుగు నెలల కిందట కొందరు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఆధారాలతో ఫిర్యాదులు పంపారు. అక్కడి నుంచి వచ్చిన ఆదేశాలతో ఓ డీఎల్‌డీఓ, ఓ ఎంపీడీఓ ఆధ్వర్యంలో తూతూమంత్రంగా విచారణ జరిపారు. నివేదికను ఇప్పటికీ బహిర్గతం చేయలేదు. గడిచిన మూడేళ్లలో మండలంలో జరిగిన పనులపై గ్రామ సభలు నిర్వహిస్తే.. బండారం బయట పడుతుంది.

చివరికి కన్నీరే

తుఫాన్ దెబ్బకు నేలకొరిగిన వరి పైరు

చేతికొచ్చిన పంట నేలపాలు



ఉద్దేహాళ్ గ్రామ సమీపంలో నేలకొరిగిన వరిపంట

బొమ్మనహాళ్(ఆంధ్రజ్యోతి): చేతికొచ్చిన వరి పంట తుఫాన్ దెబ్బకు నేలకొరిగింది. మండలంలోని ఉద్దేహాళ్, ఉంతకల్లు క్రాస్, దేవగిరిక్రాస్, రంగాపురం క్యాంప్, లింగదహాళ్, శ్రీధరఘట్ట తదితర గ్రామాలలో తుఫాన్ వర్షానికి వరిపంట నేలకొరిగింది. మండలంలోని పలు గ్రామాలలో ఈదురుగాలులతో సోమవారం రాత్రి వర్షం కురిసింది. దీంతో దాదాపు 150 ఎకరాలకు పైగా వరిపంటకు నష్టం వాటిల్లింది. అధిక ధర చెల్లించి, విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేసిన పంటను తుఫాన్ దెబ్బతీసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండురోజులుగా కొద్దిపాటి వర్షం పడి గాలి భారీగా వీచడంతో పంట నేలకొరిగిందన్నారు. ధాన్యం గింజలు భారం ఎక్కువై తడిసిన పైరు నేలకొరిగిందని రైతులు అన్నారు. ఈ ఏడాది ఎకరానికి 40 బస్తాలకుపైగా దిగుబడి వస్తుందని ఆశగా ఎదురుచూస్తున్న రైతులకు చివరికి నిరాశే మిగిలింది. పైరు నిలువుగా ఉంటే ఎకరా కోతకు 1:25 గంటలు పట్టేదని నేలకు ఒరిగిన పైరు కోయడానికి మూడు గంటల సమయం పడుతుందని, ఇది అదనపు భారమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

తొమ్మిది ఎకరాలు నేలపాలు: ఎర్రిస్వామి, రైతు, శ్రీధరఘట్ట



ఈ ఏడాది ఖరీఫ్‌లో నా సొంత భూమి రెండు ఎకరాలు, కౌలు భూమి ఏడెకరాల్లో వరిపంట సాగు చేశా. ఆది, సోమవారాలలో కొద్దిపాటి వర్షానికి, వీచిన గాలికి వరి పైరు మొత్తం నేలకు ఒరిగిపోయింది. వారంరోజుల్లో ధాన్యం ఇంటికి చేరుతాయని ఆశించా. గతంలో చేసిన అప్పులు, ఇప్పుడు పెట్టిన పెట్టుబడులు తీరుతాయని, నా భూమికి తోడు మరింత భూమి కౌలుకు తీసుకుని సాగుచేస్తే నేలపాలై మరింత అప్పును మిగిల్చింది.

అప్పులు ఎలా తీర్చాలో?: సంజీవ, రైతు, లింగదహాళ్



నాకున్న రెండెకరాల భూమిలో వరిపంట సాగుచేశా. చేతికి వచ్చిన పంట నేలకొరిగిపోయింది. వరిపంట బాగా పండి కోతకు వచ్చింది. ఈ పరిస్థితుల్లో కొద్దిపాటి వర్షానికి, భారీగా గాలి వీచి పంట మొత్తం నాశనమైపోయింది. పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో ఆందోళనగా ఉంది. కొద్దిపాటి చినుకులకు, వీచిన గాలికి కోతదశలో నష్టాన్ని మిగిల్చింది.

జడ్పీ నిధులు తిరుగు టపా..!

సెప్టెంబరులో రూ.1.68 కోట్ల గ్రాంట్

జడ్పీ నుంచి నవంబరు 29న మండలాలకు..

ఒక్క రోజులో బిల్స్ సబ్మిట్ చేయలేక నష్టం

సీఈఓ, అకౌంట్స్ విభాగం అధికారుల నిర్లక్ష్యం

అనంతపురం విద్య, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ కమిషనర్ నిధులు విడుదల చేసినా.. జడ్పీలో కొందరు సకాలంలో ఉత్తర్వులు ఇవ్వలేదు. దీంతో కోట్ల రూపాయలు వెనక్కు వెళ్లే పరిస్థితి ఏర్పడింది. ఓటాన్ అకౌంట్ కింద ఇటీవల విడుదల చేసిన నిధులు రద్దయ్యే ప్రమాదం కనిపిస్తోంది. పీఆర్ కమిషనర్ రూ.1.68 కోట్ల నిధులకు సెప్టెంబరులోనే ఉత్తర్వులు ఇచ్చారు. ఆ నిధులను మండలాలకు సర్దుబాటు చేస్తూ.. జడ్పీ సీఈఓ చాలా ఆలస్యంగా ఉత్తర్వులిచ్చారు. మండలాల్లో ఆ నిధులు డ్రా చేసుకోడానికి అవకాశం లేకపోవడంతో ఎంపీడీఓలు బిల్లులు సబ్మిట్ చేయలేదని తెలుస్తోంది. ఫలితంగా కోట్ల నిధులు రద్దయ్యే ప్రమాదం తలెత్తిందని ఎంపీడీఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని చాలా మండలాల్లో జడ్పీ ఉన్నతాధికారుల వైఖరిపై ఎంపీడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సెప్టెంబరులో ఉత్తర్వులు

జడ్పీ, ఎంపీడీఓ కార్యాలయాల పాలన సౌలభ్యం కోసం పీఆర్ కమిషనర్ ఓటాన్ అకౌంట్-2 బడ్జెట్ కింద నిధులు విడుదల చేశారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి నవంబరు 30వ తేదీ వరకూ నాలుగు నెలల కాలానికి ఈ నిధులు ఇచ్చారు. ఇందులో సీనరేజీ గ్రాంట్స్, రూ.8 పర్ క్యాపిటా, ఎంపీడీఓల వాహన అద్దె, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీల గౌరవ వేతనం, ఉద్యోగుల టీఏ, డీఏ బిల్లులు చెల్లింపునకు అవసరమైన నిధులు ఉన్నాయి.

నిధులకు గండం

కమిషనర్ ఇచ్చిన గ్రాంట్‌ను ఉమ్మడి జిల్లాలోని 63 మండలాలకు వెంటనే సర్దుబాటు చేస్తూ సీఈఓ ఉత్తర్వులు ఇవ్వాలి. అలా చేసి ఉంటే.. అన్ని మండలాల అధికారులు ఆ నిధులు డ్రా చేసుకునే వెసలుబాటు ఉండేది. కానీ జడ్పీ అకౌంట్స్ విభాగం అధికారుల నిర్లక్ష్యం, సీఈఓ అలసత్వం కారణంగా గత నెల 11వ తేదీ పేరిట కొన్ని, 30వ తేదీ పేరిట మరికొన్ని ఉత్తర్వులు సిద్ధం చేసి.. గత నెల 29న వాట్సాప్ గ్రూప్‌లో వేశారు. ఈ ఉత్తర్వుల ఆధారంగా.. ఒక్క రోజులో ఎంపీడీఓలు బిల్స్ సబ్మిట్ చేయడం, ట్రెజరీ వాళ్లు వాటికి ఒకే చెప్పడం అయ్యే పనేనా..? ఇదే కారణంగా చాలా మండలాల్లో ఆ నిధులు డ్రా చేయలేదని సమాచారం. ఈ నెల ఒకటో తేదీ నుంచి సీఎఫ్ఎంఎస్ బంద్ అయ్యింది. చాలా మండలాలకు ఆ నిధులు అందకుండానే వెనక్కువెళ్లినట్టయ్యింది. దీంతో ఎంపీడీఓలు మండిపడుతున్నారు. జడ్పీలోని అకౌంట్స్ విభాగంలో అనుభవం లేని ఉద్యోగులను వేసుకోవడం, అకౌంట్స్ విభాగంలో ఓ సీనియర్ అసిస్టెంట్ అడ్డగోలు నిర్ణయాలు తీసుకోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్న విమర్శలు వస్తున్నాయి. బదిలీల సమయంలో చక్రం తిప్పిన ఆయన.. ఆ తంతు ముగియగానే మామూళ్లు బాగా వచ్చే అకౌంట్స్ విభాగానికి వేయించుకున్నారని, అక్కడ అడ్డగోలు నిర్ణయాలు తీసుకుంటూ జడ్పీ పాలనను భ్రష్టు పట్టిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కింది స్థాయి అధికారులు ఎలాగున్నా, జడ్పీ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కూడా ఇందులో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. దీనిపై వివరణ కోరడానికి జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్యకు ఫోన్ చేయగా.. అందుబాటులోకి రాలేదు.



జడ్పీ కార్యాలయం

ఇవీ.. ఆ నిధులు	
మండలాలకు రూ.8 పర్ క్యాపిటా గ్రాంట్	రూ.26,03,876
సీనరేజీ చార్జెస్ గ్రాంట్	రూ.88,43,031
సభ్యుల గౌరవ వేతనం	రూ.45,43,437
స్టాఫ్ టీఏ, డీఏ గ్రాంట్	రూ.1,74,014
ఎంపీడీఓల వాహనాల అద్దె	రూ.7,29,209
మొత్తం	రూ.1,68,93,567

డ్రోన్లతో నేర నియంత్రణ: ఎస్పీ



డ్రోన్ గురించి వివరిస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): డ్రోన్లతో అసాంఘిక కార్యకలాపాలు, నేరాలకు చెక్ పెట్టాలని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని సబ్ డివిజన్లలో డ్రోన్ల ఆపరేటింగ్ కోసం ప్రత్యేకంగా 30 మంది పోలీసు సిబ్బందిని కేటాయించారు. వీరందరికీ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో శిక్షణ ప్రారంభించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం, గంజాయి సేవించడం, అమ్మాయిలను వేధించడం, పేకాట, చైన్ స్నాచింగ్, చోరీలు వంటి నేరాలకు పాల్పడే వారికి డ్రోన్లతో చెక్ పెట్టవచ్చని ఎస్పీ అన్నారు. డ్రోన్‌లు 3 కి.మీ. పరిధిలో ప్రదేశాలను కవర్ చేస్తాయని, విజువల్స్ సేవ్ చేస్తాయని తెలిపారు. ప్రజలను రక్షించేందుకు ఇవి ఉపయోగపడతాయని అన్నారు. ప్రస్తుతం 3 డ్రోన్లు ఎగురవేస్తున్నామని, త్వరలోనే జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రోన్లు ఎగురవేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బడిలో లైంగిక వేధింపులు..?

ఓ టీచర్ తాకుతున్నారని ఆరోపణలు

కలకలం రేపుతున్న బాలికల ఆడియో

ఉపాధ్యాయిని ఉద్దేశపూర్వకంగా చేయించారా..?

కేఎస్ఆర్ హైస్కూల్‌లో టీచర్ల విభేదాలతో రచ్చ

హెచ్ఎం, టీచర్లను పిలిచి విచారిస్తాం: డీఈఓ





కెఎస్ఆర్ హైస్కూల్

అనంతపురం విద్య, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని కేఎస్ఆర్ హైస్కూల్‌లో బాలికలను లైంగికంగా వేధిస్తున్నట్లు బయటికొచ్చిన ఓ ఆడియో కలకలం రేపుతోంది. ఎనిమిదో తరగతి చదువుతున్న పలువురు విద్యార్థినులను ఓ స్కూల్ అసిస్టెంట్ కొంత కాలంగా వేధిస్తున్నాడని అందులో ఆరోపించారు. తమను తాకుతున్నాడని, గిల్లుతున్నాడని కొందరు బాలికలు మాట్లాడిన ఆడియో బయటకు రావడానికి పాఠశాల ఉపాధ్యాయులలో అంతర్గత పోరు కారణమని సమాచారం. కంప్యూటర్ ల్యాబ్‌లో ఎన్ఎంఎంఎస్ క్లాసులకు వెళ్లినప్పుడు ఓ స్కూల్ అసిస్టెంట్ వికృత చేష్టలకు పాల్పడుతున్నాడని బాధిత బాలికలు ఆరోపించారు. సుమారు 10 నుంచి 12 మంది విద్యార్థినులు మాట్లాడి.. రికార్డు చేశారు. ఈ వ్యవహారంపై వారం క్రితమే స్కూల్‌లో రాజీ జరిగిందని అంటున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడి నుంచి సంజాయిషీ లెటర్ రాయించుకున్నట్లు తెలుస్తోంది.

నిజమా..? నిందా..?

బాలికల ఆడియో బయటకు రావడం వెనుక అనేక కారణాలు ఉన్నాయని అంటున్నారు. పాఠశాలలో ఓ ఉపాధ్యాయని(స్కూల్ అసిస్టెంట్) ఉద్దేశపూర్వకంగా విద్యార్థినులతో ఇలా చెప్పించారనే ప్రచారం జరుగుతోంది. ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌ను దెబ్బకొట్టడానికే ఆమె విద్యార్థినులను వాడుకుని, వారి వాయిస్ రికార్డును వైరల్ చేయించారని ఆరోపణలు వస్తున్నాయి. ఉపాధ్యాయుల మధ్య కోల్డ్ వార్ ఎలా ఉన్నా, బాలికలను లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు రావడం దుమారం రేపుతోంది. తమ పాఠశాలలో అలాంటిదేమీ జరగలేదని హెచ్ఎం నారాయణ వివరణ ఇచ్చారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌ను విచారించామని తెలిపారు. ఆయన వివరణ కూడా తీసుకున్నానని అన్నారు. ఓ ఉపాధ్యాయని తరగతులకు వెళ్లకుండా ఇలాంటి రాజకీయాలు చేస్తున్నారని, విద్యార్థినులతో బలవంతంగా అలా చెప్పించారని అన్నారు.

విచారణ జరిగితేనే..

జిల్లా కేంద్రంలో, ఏకంగా 1500 మంది బాలికలు చదువుకునే చోట ఇలాంటి పరిణామాలు చోటు చేసుకోవడం విమర్శలకు తావిస్తోంది. నగరంలోని పలు సంక్షేమ వసతి గృహాలలో ఉంటున్న బాలికలు కేఎస్ఆర్ హైస్కూల్‌లో చదువుకుంటున్నారు. పాఠశాలలో 70 నుంచి 80 శాతం మంది విద్యార్థులు హాస్టళ్లలో ఉంటున్నవారే. బాలికల భద్రత దృష్ట్యా లైంగిక వేధింపుల ఆరోపణలు, టీచర్ల మధ్య విభేదాల గురించి ఉన్నతాధికారులు సమగ్రంగా విచారించాల్సిన అవసరం ఉంది. లైగింక వేధింపులు నిజమేనా..? లేక ఉద్దేశపూర్వకంగా బాలికలను స్వార్థ ప్రయోజనాలకు వాడుకున్నారా..? నిగ్గుతేల్చి.. కఠిన చర్యలు తీసుకోవాలని నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు.

పాఠశాలలో జరుగుతున్న ఈ వ్యవహారాలు ఏవీ తన దృష్టికి రాలేదని డీవైఈఓ శ్రీనివాసులు అన్నారు. స్కూల్‌లో గొడవ అంటూ డీఈఓ నుంచి సమాచారం రావడంతో మంగళవారం వెళ్లి విచారించానని తెలిపారు. కానీ లైంగిక వేధింపుల గురించి తన దృష్టికి రాలేదని అన్నారు. లైంగిక వేధింపుల గురించి తన దృష్టికి రాలేదని డీఈఓ ప్రసాద్ బాబు అన్నారు. హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్లను బుధవారం పిలిపించి, విచారిస్తానని తెలిపారు. బాధ్యులు ఎవరైనా చర్యలు తీసుకుంటామని అన్నారు.

'అపార్' ఇబ్బందులు తొలగించండి

విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను కోరిన మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం/ఉరవకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అపార్ జనరేషన్‌లో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కోరారు. ఈ మేరకు మంగళశారం ఆయన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. జిల్లాలో రెండ్రోజుల కిందట బెళుగుప్ప మండలం కోనాపురం నుంచి గోళ్ల గ్రామానికి వెళ్తుండగా... మార్గమధ్యంలో పొలాల్లో పనిచేస్తున్న కూలీలతో తాను మాట్లాడినట్లు తెలిపారు. ఈ సందర్భంలో కూలీలు తమ పిల్లలకు సంబంధించి అపార్ జనరేషన్ కోసం ఎదురవుతున్న ఇబ్బందులు తన దృష్టికి తెచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు. అపార్‌కు అవసరమైన ఆధార అప్డేషన్ కోసం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారని మంత్రి లోకేశ్‌కు పయ్యావుల వివరించారు. బెళుగుప్ప నుంచి కళ్యాణదుర్గానికి వెళ్లి రావడానికి చార్జీలు, ఫీజులు, నోటరీ చేయించేందుకు రూ. 800 నుంచి 1000లు అడుగుతున్నారని, ఆధార్ సర్వీస్ సెంటర్లలో డబ్బులు చెల్లించేందుకు దాదాపు రూ.2 వేల నుంచి రూ.3 వేలు ఖర్చవుతోందని తనతో కూలీలు ఆవేదన వ్యక్తం చేసినట్లు లోకేశ్‌కు వివరించారు. 35 శాతం మంది విద్యార్థులు పేరు మార్పులు, పుట్టిన తేదీలు, తదితర వివరాలు మార్పు చేసుకునేందుకు నోటరైజ్ అఫిడవిట్ అడుగుతున్నారని తెలిపారు. సాధారణ కూలీలు, దిగువ, మధ్య తరగతి ప్రజలు తమ పిల్లల అధార్ అప్డేషన్ కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆయన నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆధార్ అప్డేషన్‌లో ఎదురవుతున్న ఇబ్బందులు, సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని లోకేశ్ హామీ ఇచ్చినట్లు మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు.



రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో మంత్రి పయ్యావుల కేశవ్

ఉపాధి కోర్సులపై ఉచిత శిక్షణ

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధిని కల్పించే కోర్సులపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆర్ట్స్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. సంభవ్ ఫౌండేషన్, కియ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, ఐటీఐ అర్హత గల విద్యార్థులకు డేటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంట్ ఎగ్జిక్యూటివ్, సర్వీస్ టెక్నీషియన్, డిగ్రీ బీకామ్, బీటెక్, ఐటీఐ కోపా విద్యార్థులకు డేటా అనాలసిస్ కోర్సులపై శిక్షణ ఇస్తారని తెలిపారు. వివరాలకు 7981989190, 9618488031 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

లింగ వివక్షలేని సమాజ స్థాపనకు కృషి

డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి



లింగవివక్షపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): లింగ వివక్ష లేని సమాజ స్థాపనకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పేర్కొన్నారు. స్థానిక పంగల్ రోడ్డు సమీపంలోని టీటీడీసీలో మంగళవారం డీఆర్‌డీఏ-వెలుగు, ఐసీడీఎస్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీలు మాట్లాడుతూ లింగ వివక్ష హింసకు వ్యతిరేకంగా కలికట్టుగా పనిచేసి, ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆడ, మగ ఇద్దరూ సమానమేనని, ఎటువంటి వివక్ష లేని సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 18సంవత్సరాలు వయసు వచ్చే వరకు బాలికలకు వివాహం చేయరాదని, సొంతకాళ్లపై నిలబడేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం లింగ వివక్ష లేని సమాజ స్థాపనకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీడాప్ జేడీఎం సూర్యనారాయణ, ట్రైనర్లు ప్రతాప్‌రెడ్డి, నారాయణస్వామి, మునీంద్ర, సాయికిరణ్, మధుసూదన్, ఐసీడీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అరటి సాగు అదుర్స్!

కూడేరు మండలంలో పెరిగిన సాగు విస్తీర్ణం



అరటిగెల

కూడేరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో పండిస్తున్న ఉద్యాన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ సారవంతమైన ఎర్రనేలలు ఉండటంతో పంటల దిగుబడి కూడా బాగా వస్తోంది. మండలంలో చీనీ, మామిడితోపాటు అరటి పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఇక్కడ పండించిన పంటలను ముఖ్యంగా అరటిని ప్రపంచ దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ముఖ్యంగా అరటి పంట మండలంలో చెప్పుకోదగ్గ స్థాయిలో సాగవుతోంది. ఈక్రమంలోనే అరటి సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తోంది. హెక్టారుకు మొదట పంట సాగుకు రూ.30 వేలు, రెండో పంటకు రూ. 10వేలు అందిస్తోంది.

అన్నదాతల జాగ్రత్తలతో అధిక దిగుబడులు పండిన పంట విదేశాలకు ఎగుమతి





అరటి తోట

● పెరిగిన సాగు

ఇటీవలి కాలంలో కూడేరు మండలంలో అరటి సాగు ఊపందుకుంది. కూడేరుతోపాటు రామచంద్రపురం, కడదరకుంట, చోళసముద్రం, జయపురం, ఎంఎంహళ్లి తదితర గ్రామాల్లో దాదాపు 150 ఎకరాల వరకు అరటి సాగు చేశారు. సాధారణంగా రైతులు కేఎఫ్, ఏసీ, మైక్రోసస్, జైయిన్ తదితర రకాల అరటి పిలకలను బెంగళూరు, హైదరాబాద్, మైసూర్ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారుల ద్వారా తెప్పించుకుని, సాగు చేస్తారు. ఎకరాకు 1450 మొక్కలు నాటుతారని, ఒక్కొక్క మొక్క రూ.15 నుంచి రూ.20తో కొనుగోలు చేస్తారు. అరటి పంట సాగు ప్రారంభం నుంచి చివరి వరకు ఎకరాకు దాదాపు లక్షన్నర వరకు పెట్టుబడి వస్తుంది. దిగుబడి ఆశాజనంగా ఉంటే ఎకరాకు దాదాపు 20 నుంచి 25 టన్నుల వరకు దిగుబడి వస్తుందని రైతులు పేర్కొన్నారు. ప్రస్తుతం ధర టన్ను రూ.13 వేల నుంచి రూ.18 వేల వరకు ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

ఇక్కడి పంట విదేశాలకు..

మండలంలో పండించిన అరటి పంటను ఇరాక్, ఇరాన్ వంటి ఇతర దేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నారు. అరటి తోట వద్దే వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు పంటను కొనుగోలు చేస్తున్నారు. కోతల అనంతరం వివిధ మార్గాల ద్వారా విదేశాలకు, దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. పంట సాగు చేసినప్పటి నుంచి కోత వరకు అన్నదాతలు తీసుకుంటున్న జాగ్రత్తల వల్ల పంట దిగుబడి బాగా వస్తున్నట్లు రైతులు తెలిపారు.

● ఎంబీఏ చదివి... అరటి సాగులో రాణించి..

రామచంద్రపురం గ్రామానికి చెందిన యువకుడు బళ్లారి వెంకటేష్ ఎంబీఏ చదివి ఉద్యోగ ప్రయత్నాలు చేయకుండా వ్యవసాయంపై మక్కువతో అరటి సాగు చేశాడు. తనకున్న ఆరెకరాల పొలంలో అరటి సాగుచేశాడు. ఇందుకు రూ. ఆరున్నర లక్షలు పెట్టుబడి పెట్టినట్లు తెలిపాడు. కేఎఫ్ రకం మొక్కలను బెంగళూరు నుంచి వ్యాపారులతో కొనుగోలు చేసినట్లు వెల్లడించాడు. ఒక్కో మొక్కను రూ.14తో కొనుగోలు చేసి, ఏడు వేల మొక్కలను నాటినట్లు పేర్కొన్నారు. మొదటి పంట 11 నెలలకు వచ్చింది. దిగుబడి ఆశాజనంగా రావడంతో దాదాపు 135 టన్నుల పండింది. మార్కెట్‌లో టన్ను రూ.13వేల నుంచి రూ.15 వేల వరకు అమ్ముడుపోవడంతో దాదాపు 17లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు రైతు బళ్లారి వెంకటేష్ తెలిపారు. మొదటి కోత పూర్తయిన 9 నెలల తర్వాత రెండో కోత కూడా ప్రస్తుతం సిద్ధంగా ఉందని వివరించారు.



అరటి గెలను చూపుతున్న రైతు బళ్లారి వెంకటేష్

సస్యరక్షణతో అధిక దిగుబడి

అరటి పంటలో సస్య రక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. వాతావరణంలో మార్పుల వల్ల పంటకు తెగుళ్ల సోకుతాయి. వాటి నివారణకు రసాయన మందులను ఎప్పటికప్పుడు పిచికారీ చేసుకోవాలి. అప్పుడే అరటికాయలు నాణ్యతగా ఉంటాయి. అరటి పంటకు గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉంటే సిగటోక మచ్చ తెగుళ్ల సోకుతుంది. వీటి నివారణకు కార్బెండిజమ్ ఒక గ్రామును ఒక లీటర్ నీటిలో కలుపుకొని పిచికారీ చేయాలి. తెగుళ్ల తీవ్రంగా ఉంటే ప్రాపికోనజోల్, మినరల్ ఆయిల్ ఒక లీటర్ నీటికి 2 ఎంఎల్ కలిపి పిచికారి చేయాలి. అలాగే పంటకు బ్యాక్టీరియా సాఫ్ట్‌రాట్ మార్చి నెలలో అధికంగా వస్తుంది. వాటి నివారణకు బ్లీచింగ్ పౌడర్ 50 గ్రాములు చెట్టు మొదలు దగ్గర వేయాలి.



-నెట్టి కంటయ్య, ఉద్యాన శాఖాధికారి

నాలుగు ప్రాజెక్టుల అమలుకు చర్యలు

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి) జిల్లాలో ఉన్న ఉపరితల నీటి (సర్ఫేస్ వాటర్) ద్వారా మరో 4 ప్రాజెక్టులు అమలు చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్ తెలిపారు. కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం ఆ ప్రాజెక్టులకు సంబంధించి పలు విషయాలను ఆయన వెల్లడించారు. జిల్లాలో ఉన్న ఉపరితల నీటి వనరులను వినియోగించుకొని రూ.480 కోట్లతో 4 మండలాల్లో నాలుగు ప్రాజెక్టుల అమలుకు అనుమతి కోసం ప్రభుత్వానికి వినతి పంపామన్నారు. అనుమతి వచ్చిన వెంటనే చర్యలు చేపడతామన్నారు. శింగనమల మండలంలోని 4 గ్రామాలు, గుంతకల్లు మండలంలోని మరో 3 గ్రామాలు, ఉరవకొండ, రాప్తాడు మండలాల్లోని పలు గ్రామాల్లో ఈ ప్రాజెక్టులు అమలు చేస్తామన్నారు. వీటి కోసం పీఏబీఆర్‌తో పాటు మిడ్‌పెన్నార్‌లో ఉన్న సర్ఫేస్ వాటర్‌ను పైప్‌లైన్ ద్వారా అందజేస్తామన్నారు.

తల్లీబిడ్డ మృతిపై విచారణకు త్రిసభ్య కమిటీ

అనంతపురంటౌన్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రిలో సోమవారం జరిగిన తల్లీబిడ్డ మృతిపై వాస్తవాలు తెలుసుకునేందుకు త్రిసభ్య కమిటీని నియమించినట్లు సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు తెలిపారు. రాయదుర్గం పట్టణానికి చెందిన సరళజ్యోతితో పాటు పుట్టినబిడ్డ మృతి చెందారు. ఇందుకు డాక్టర్ల నిర్లక్ష్యంమే కారణమనే విమర్శలు వచ్చాయి. ఈనేపథ్యంలో సీనియర్ వైద్యులు, సర్జన్ విభాగాధిపతి డాక్టరు రామస్వామి నాయక్, చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టరు రవికుమార్, అనస్తీషియా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టరు జగదీసాచార్యులను విచారణకు నియమించినట్లు తెలిపారు. ఈకమిటీ పూర్తి స్థాయిలో విచారణ చేసి నివేదిక ఇస్తుందని అందులో డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యం ఉందని తేలితే చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ తెలిపారు.

రేపు ప్రాంగణ నియామకాలు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ యూనివర్సిటీలో గురువా రం ప్రాంగణ నియామకాలు చేపడుతున్నట్లు వీసీ ఎస్ఏ కోరి మంగళవారం తెలిపారు. మానవ వనరుల నిర్వహణ, మూలధనం వంటి రంగాల్లో సేవలందిస్తున్న ఏడీపీ సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీలో కనీసం 60శాతం మార్కులు సాధించిన ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులందరూ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. జంతులూరులోని సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించే ఇంటర్వ్యూలకు ఆసక్తిల విద్యార్థులు హాజరుకావాలని కోరారు. వివరాలకు 9491490338 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

రబీ ఈ-పంట నమోదు ఆరంభం

అనంతపురం అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి ఈ పంట నమోదు మంగళవారం ఆరంభమైంది. గత నెలాఖరులో వ్యవసాయ శాఖ సిబ్బందికి యాప్‌లో ఈ పంట నమోదు చేయడంపై శిక్షణ ఇచ్చారు. ఈ పంట నమోదుకు 3.1 వర్షన్ యాప్ అప్లికేషన్‌ను ఇచ్చారు. ఈ పంట నమోదుతోపాటు రైతుల బయోమెట్రిక్‌ను పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ ఏడాది రబీ లో పప్పుశనగ 72909 హెక్టార్లు, వరి 6928, జొన్న 4735, మొక్కజొన్న 7844 హెక్టార్ల సాగు లక్ష్యంగా నిర్ణయించారు. మిగతా విస్తీర్ణంలో ఉలవలు, పెసలు, అలసంద తదితర పంటలున్నాయి. ఇప్పటిదాకా జిల్లా వ్యాప్తంగా 71996 హెక్టార్లల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో 57970 హెక్టార్లల్లో పప్పుశనగ పంట సాగైంది.

తొలిరోజు 3వేల ఎకరాల్లో...

జిల్లాలో తొలి రోజు మంగళవారం మూడు వేల ఎకరాల్లో ఈ పంట నమోదుచేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 20లోగా ఈ పంట నమోదుతోపాటు రైతులతో బయోమెట్రిక్ వేలిముద్ర వేయించాలని ఆదేశించారు. ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు సామాజిక తనిఖీ కోసం రైతుల జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించి, గ్రామసభలు ఏర్పాటు చేస్తారు. ఫిబ్రవరి 6 నుంచి 10 దాకా రైతుల నుంచి అభ్యంతరాలు, ఫిర్యాదు స్వీకరిస్తారు. ఫిబ్రవరి 15న తుది ముసాయిదా జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తారు. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ సిబ్బందికి రైతులు సహకరించి సకాలంలో ఈ పంట నమోదు పూర్తి అయ్యేందుకు సహకరించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ కోరారు.

హంద్రీనీవాకు కళ!

రూ. 936.70 కోట్లతో ప్రధాన కాలువ లైనింగ్ పనులు
నిధులు మంజూరు చేస్తూ జీవో జారీ

అనంతపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన హంద్రీ నీవా ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వంలో ఆదరణ లభిస్తోంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు... ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఉమ్మడి జిల్లా కొచ్చిన సందర్భాల్లోనూ హంద్రీనీవా పెండింగ్ పనులు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆమేరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో హంద్రీనీవా ప్రధాన కాలువ లైనింగ్ పనులకు ఆమోద ముద్ర వేశారు. ఆ మేరకు రూ. 936.70 కోట్లతో హంద్రీనీవా ప్రధాన కాలువ లైనింగ్ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నిధులు మంజూరు చేస్తూ జీవో నెం 405 మంగళవారం జారీ చేశారు. దీంతో హంద్రీనీవా ప్రధాన కాలువ లైనింగ్ పనులు ఇక నుంచి వేగంగా జరగనున్నాయి.

జీడిపల్లి నుంచి...

హంద్రీనీవా ప్రాజెక్టు ఫేజ్-2లో భాగంగా జీడిపల్లి జలాశయం దగ్గర నుంచి అంటే 216.300 కి.మీ నుంచి 230 కి.మీ వరకూ రూ. 58.30 కోట్ల ఖర్చుతో లైనింగ్ పనులు చేపట్టనున్నారు. 230 కి.మీ నుంచి 245 కి.మీ వరకూ రూ. 65.60 కోట్లు, 245 కి.మీ నుంచి 260 కి.మీ వరకూ రూ. 74.30 కోట్లు, 260 కి.మీ నుంచి 280 కి.మీ వరకూ రూ. 64.20 కోట్లు, 280 కి.మీ నుంచి 300 కి.మీ వరకూ శ్రీసత్యసాయి జిల్లాలోని హంద్రీనీవా ప్రధాన కాలువ లైనింగ్ పనులకు రూ. 57.80 కోట్లు, 285.100 కి.మీ నుంచి 287.100 కి.మీ టన్నెల్ ఏర్పాటు కోసం రూ. 36.19 కోట్లు, 300 కి.మీ నుంచి 320 కి.మీ వరకూ పెండింగ్‌లో ఉన్న పనులకు(చెన్నేకొత్తపల్లి మండలంలో) రూ. 103.32 కోట్లు, 320 కి.మీ నుంచి 340 కి.మీ వరకూ శ్రీసత్యసాయి జిల్లాలో రూ.61.04 కోట్లు, 340 కి.మీ నుంచి 358 కి.మీ వరకూ పెండింగ్ పనులతో పాటు ప్రధాన కాలువ ఆధునికీకరణ కోసం రూ. 119.35 కోట్ల నిధులు మంజూరు చేశారు. అదే విధంగా 358.150 కి.మీ నుంచి 360.250 కి.మీ వరకూ టన్నెల్ పెండింగ్ పనులు, ఇతరత్ర నిర్మాణాలు(బుక్కపట్నం మండలం పరిధిలో) కోసం రూ. 55.40 కోట్లు, 360.400 కి.మీ నుంచి 380.150 కి.మీ వరకూ(బుక్కపట్నం మండల పరిధిలో) పెండింగ్ పనుల పూర్తికి రూ. 161.60 కోట్లు, 380 కి.మీ నుంచి 400 కి.మీ వరకూ(ముదిగుబ్బ మండల పరిధిలో) పెండింగ్ పనుల పూర్తికి రూ. 79.60 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ పనులు పూర్తి చేయడానికి ప్రభుత్వం పరిపాలన అనుమతులు సంబంధిత శాఖాధికారులకు మంజూరు చేసింది.

వెడల్పు చేయకుండా లైనింగ్ పనులా..?

జిల్లాకు తీవ్ర నష్టం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



అనంతపురం కల్చరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ పనులు చేస్తే జిల్లాకు తీవ్ర నష్టం కలుగుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన జీఓ నెం.405 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి విరుద్ధంగా ఉందని విమర్శించారు. పదివేల క్యూసెక్కుల సామర్థ్యంతో కాలువ వెడల్పు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు నాయుడు ప్రస్తుతం అందుకు విరుద్ధంగా జీఓ ఇవ్వడం సరికాదన్నారు. ఈ ఏడాది శ్రీశైలం ప్రాజెక్టు పొంగి పొర్లినా జిల్లాలోని చెరువులు నింపలేకపోవడానికి ప్రధాన కారణం కాలువ సామర్థ్యం తక్కువగా ఉండటమే నన్నారు. నాలుగు రోజుల కిందట జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు అనంతపురం జిల్లాను అభివృద్ధి చేస్తామని చెప్పి, ఇపుడు ఇలా కేవలం లైనింగ్ పనులకు మాత్ర మే నిర్ణయించడం దారుణమని విమర్శించారు. హంద్రీనీవా ప్రారంభమయ్యే కర్నూలు జిల్లాలో లైనింగ్ చేయకుండా అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో మాత్రమే ఎందుకు చేస్తున్నారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రూ.936.70కోట్ల లైనింగ్ పనులను 12 ప్యాకేజీల కింద విభజించడం ద్వారా జిల్లా రైతులకంటే కాంట్రాక్టర్లే ఎక్కువ లాభపడతారన్నారు. ఇరిగేషన్ శాఖకు కేటాయించిన నిధుల నుంచే ఈ కాలువ లైనింగ్ చేపడతామని జీఓలో పేర్కొనడం అనేక అనుమానాలకు తావిస్తోందని తెలిపారు.

నేడు పాలిటెక్ ఫెస్ట్

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్టేట్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో బుధవారం రీజనల్ పాలిటెక్‌ఫెస్ట్-2024ను నిర్వహిస్తున్నట్లు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్య ప్రతిభాపాటవాలను గుర్తించి, వారిని ప్రోత్సహించేలా టెక్‌ఫెస్ట్-2024ను రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టారని పేర్కొన్నారు. కళాశాలలో నిర్వహించే ఫెస్ట్‌లో ఉమ్మడి జిల్లాలోని 17 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు వారి ప్రాజెక్టులను ప్రదర్శిస్తారని తెలిపారు. ఉత్తమ ప్రాజెక్టులను ఎంపికచేసి రాష్ట్రస్థాయి ప్రదర్శనా పోటీలకు పంపుతామన్నారు. రెండురోజులపాటు నిర్వహించే ఫెస్ట్‌కు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రత్యేక అతిథిగా హాజరవుతారని తెలిపారు.

అనంతలో మానవహక్కుల వేదిక రాష్ట్ర మహాసభలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంబంధించి జిల్లాలో ఈనెల 14, 15వ తేదీల్లో మానవ హక్కుల వేదిక 10వ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఆ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యూజి శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో సభలు నిర్వహిస్తామన్నారు. కులగణన ఎందుకు అవసరం అనే అంశంపై సామాజిక విశ్లేషకుడు ఎస్ఎన్ సాహు, బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు అనే అంశంపై స్వతంత్ర విలేకరి మాలిని సుబ్రహ్మణ్యం, కాషాయీకరణ, కార్పొరేటీకరణ అనే అంశాలపై చరిత్ర విశ్రాంత అధ్యాపకుడు కొప్పర్తి వెంకటరమణమూర్తి ప్రసంగిస్తారన్నారు. అన్నివర్గాల ప్రముఖులు, ప్రజలు మహాసభల్లో విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎవరి మేలు కోసం..?

జిల్లాకు రెండేళ్ల కిందట 195 గోడౌన్ల మంజూరు

- 93 పూర్తి..
- రూ.51 కోట్ల బిల్లుల చెల్లింపు
- సహకారశాఖకు అప్పగించని మార్కెటింగ్ శాఖ
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- సొసైటీలపై మోయలేని వడ్డీ భారం
- చక్రం తిప్పిన డెప్యుటేషన్ ఉద్యోగి



బుక్కరాయ సముద్రంలోని గోడౌన్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సొసైటీలకు ఆర్థిక పరిపుష్టి కల్పించేందుకు నిర్మించిన గోడౌన్లను సహకార శాఖకు స్వాధీనం చేయకుండా మార్కెటింగ్ శాఖ ఇంజనీర్లు నిర్లక్ష్యం చేస్తున్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి జిల్లాకు కేంద్ర ప్రభుత్వం 195 గోడౌన్లను మంజూరు చేసింది. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వం నిధులు చెల్లించకుండా భారాన్ని ఆప్కాబ్, సొసైటీలపైనే మోపింది. దీంతో ఆప్కాబ్, ఏడీసీసీ బ్యాంకు, సొసైటీలు నాబార్డు నుంచి రుణాలు తీసుకుని గోడౌన్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. మూడేళ్లలో 93 గోడౌన్లను మాత్రమే పూర్తి చేశారు. వీటిని సహకార శాఖకు అప్పగించకుండా మార్కెటింగ్ శాఖ ఇంజనీర్లు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇప్పటి వరకు చెల్లించిన రూ.51కోట్ల బిల్లుల రుణాలకు సంబంధించి సొసైటీల నుంచి వడ్డీ వసూలు చేస్తున్నారు. ఎటువంటి ఆదాయం (అద్దెల ద్వారా వచ్చే ఆదాయం) లేకనే వడ్డీ భారం సొసైటీలపై పడుతోంది.

బిల్లుల ఆమోదంలో ఆప్కాబ్ అధికారి పాత్ర కీలకం


గోడౌన్ల నిర్మాణం, బిల్లుల ఆమోదంలో ఓ ఆప్కాబ్ అధికారి కీలకంగా వ్యవహరించారు. ఆప్కాబ్ ఉద్యోగి గోడౌన్ల నిర్మాణం పేరుతో ఏడీసీసీ బ్యాంకుకు డెప్యుటేషన్‌పై వచ్చారు. విజయవాడలో ఉండాల్సిన ఆయన జిల్లాలోనే ఉంటూ చక్రం తిప్పుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో తన పలుకుబడితో ఇక్కడికి వచ్చిన ఆ ఆప్కాబ్ అధికారి మూడేళ్ల డెప్యుటేషన్ గడువు ముగిసినా ఇక్కడే ఉంటున్నారు. గోడౌన్ల నిర్మాణానికి సంబంధించి వైసీపీ సానుభూతిపరులైన కాంట్రాక్టర్లకు మేలు చేసేందుకే ఆయన డెప్యుటేషన్‌పై ఉంటూ బిల్లులు చెల్లిస్తూ ముడుపులు పుచ్చుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గోడౌన్లకు సంబంధించి కాంట్రాక్టర్లకు ఇప్పటి వరకు రూ.51కోట్లు చెల్లించారు. సాధారణంగా గోడౌన్ల నిర్మాణం పూర్తి అయిన తరువాత క్షేత్ర స్థాయిలో సహకార శాఖ, మార్కెటింగ్, ఏడీసీసీ బ్యాంకు, సొసైటీ అధికారుల బృందం పర్యవేక్షణ చేసిన అనంతరం బిల్లులు చెల్లించాలి. కానీ అవేవీ పట్టించుకోకుండా బిల్లులు చెల్లించేశారు. అయితే వీటిని వినియోగంలోకి తేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. జిల్లా కేంద్రానికి అతి సమీపంలోని బుక్కరాయసముద్రంలో నిర్మించిన గోడౌన్‌లో మందుబాబులు సకలం అక్కడే కానిచ్చేస్తున్నా పట్టించుకునేవారే లేరు.

మార్కెటింగ్ శాఖ ఇంజనీర్ల నిర్లక్ష్యం

ఉమ్మడి జిల్లాలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో 195గోడౌన్ల నిర్మాణానికి కేంద్రప్రభుత్వం అనుమతిచ్చింది. వీటిలో అనంతపురం జిల్లాలో వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోడౌన్లు 18, 500మెట్రిక్‌టన్నుల సామర్థ్యంతో 84 గోడౌన్ల నిర్మాణం చేపట్టారు. శ్రీతస్యసాయి జిల్లాలో వెయ్యి మెట్రిక్‌టన్నులకు సంబంధించి 21, 500మెట్రిక్ టన్నులకు సంబంధించి 72 మొత్తంగా 93 గోడౌన్లను నిర్మించాలని నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు అనంతపురం జిల్లాలో 54, శ్రీసత్యసాయి జిల్లాలో 49గోడౌన్ల నిర్మాణం పూర్తి చేశారు. వెయ్యి మెట్రిక్‌టన్నుల గోడౌన్‌కు రూ.85లక్షలు, 500మెట్రిక్ టన్నుల గోడౌన్లకు రూ.45లక్షల నిధులు కేటాయించారు. నిర్మాణం పూర్తి చేసి ఏడాది కావస్తున్నా వీటిని సహకార శాఖకు స్వాధీనం చేయడంలో మార్కెటింగ్ శాఖ ఇంజనీర్లు నిర్లక్ష్యం చేస్తూ వస్తున్నారు.

సొసైటీలపై మోయలేని ఆర్థికభారం

గోడౌన్ల నిర్మాణం సొసైటీలకు ఆర్థిక భారం కలిగిస్తోంది. గోడౌన్ల నిర్మాణం పూర్తయిన వెంటనే ఉపయోగంలోకి వస్తే వాటి ద్వారా వచ్చే ఆదాయంతో సొసైటీలకు వెసులుబాటు కలిగేది. నాబార్డు ద్వారా ఆప్కాబ్‌కు, ఆప్కాబ్‌ద్వారా ఏడీసీసీ బ్యాంకుకు, ఏడీసీసీ బ్యాంకు నుంచి సొసైటీలకు రుణాలు చెల్లిస్తారు. సొసైటీలు తీసుకున్న రుణాలకు 4శాతం వడ్డీతో కలిపి తిరిగి బ్యాంకుకు చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంకు అప్పు ఇచ్చిన నాటి నుంచే వడ్డీ కట్టించుకుంటారు.



అయితే గోడౌన్లు వినియోగంలోకి రాకపోవడంతో ఆదాయం లేక వడ్డీ భారం సొసైటీలపై తీవ్రంగా పడుతోంది.

మార్కెటింగ్ శాఖ ఇంజనీరుకు లేఖ పంపాం



నిర్మించిన గోడౌన్‌లను స్వాధీనం చేయాలని పలు మార్లు మార్కెటింగ్ శాఖ ఇంజనీరుకు లేఖ రాశాం. అయితే ఇప్పటి వరకు ఒక్కటి కూడా మా ఆధీనంలో కి రాలేదు. పూర్తి అయిన వాటికి బిల్లులు కూడా చెల్లించారు. స్వాధీనం చేయడంలో కాలయాపన చేస్తున్నారు. స్వాధీనం చేసిన అనంతరం ప్రారంభోత్సవం చేస్తాం. బిల్లుల చెల్లింపులన్నీ ఆప్కాబ్, మార్కెటింగ్ శాఖద్వారానే జరుగుతున్నాయి. ఇందులో మా ప్రమేయం ఏమీ ఉండదు. సొసైటీల నుంచి రికవరీ చేయాల్సి ఉంటుంది.

- అరుణకుమారి, జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ)

న్యూస్‌బాక్స్

పంటల బీమాను సద్వినియోగం చేసుకోండి

15లోగా ప్రీమియం చెల్లించాలి

జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌కు సంబంధించి పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఈనెల 15లోగా పప్పుశనగ, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న, టమోటా పంటలకు పంటల బీమా వర్తింపజేసేందుకు ప్రీమియం చెల్లించాలన్నారు. డిసెంబరు 31లోగా వరి పంటకు ప్రీమియం చెల్లించాలన్నారు. తుఫాన్, కరువు, అకాల వర్షం తదితర ప్రకృతి వైపరీత్యాల మూలంగా పంట దిగుబడి నష్టపోతే ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద దిగుబడి ఆధారిత బీమాకు సంబంధించి పప్పుశనగ ఎకరాకు రూ.450లు, వేరుశనగ పంటకు ఎకరాకు రూ.480లు, జొన్నకు ఎకరాకు రూ.315లు, మొక్కజొన్నకు రూ.525లు, వరి పంటకు ఎకరాకు రూ.630లు ప్రీమియం చెల్లించాలన్నారు. వాతావరణ ఆధారిత బీమాకు సంబంధించి టమోటా పంటకు ఎకరాకు రూ.1650లు చెల్లించాలన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన వర్తించేందుకు ఫ్యూచర్ జనరాలి ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, వాతావరణ ఆధారిత పంటల బీమా కోసం అగ్రికల్చర్ అస్యూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు ప్రీమియం చెల్లించాలన్నారు. ఆయా పంటలకు బ్యాంక్‌లో రుణం తీసుకునే రైతులు బ్యాంక్‌లోనే ప్రీమియం చెల్లించవచ్చునన్నారు. రుణం తీసుకోని రైతులు కామన్ సర్వీస్ సెంటర్లు, పీఏసీఎస్, పోస్టాఫీస్, సచివాలయాల్లో ఎన్‌సీఐపీ నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ లేదా వెబ్‌సైట్ మొబైల్ ద్వారా ప్రీమియం చెల్లించవచ్చునన్నారు. ఆధార్, భూమి లేదా కౌలు కార్డు, రైతు సేవా కేంద్రం ద్వారా సిబ్బందితో పొందిన పంట వేసినట్లు ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పుస్తకం జిరాక్స్, ఫోన్ నంబర్ సమర్పించి ఆన్‌లైన్ ద్వారా ప్రీమియం చెల్లించాలని సూచించారు.

టమోటా కిలో రూ.49

అనంతపురం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 49తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 900 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 42, కనిష్ఠ ధర రూ. 33 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.26 వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 26,690 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10వేలు, సరాసరి రూ. 20,400తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 21 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నీటి నిల్వ 1.681 టీఎంసీలు

బెళుగుప్ప, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు మంగళవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో ఇన్‌ఫ్లో 958 క్యూసెక్కులు ఉండగా ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ 2కు 768 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నిలు రెండోసారీ వాయిదా పడ్డాయి. మొదట అక్టోబరు 16 నుంచి నవంబరు 24లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తరువాత ఈ నెల 5 నుంచి 8లోపు సాగునీటి సంఘాల ఎన్నికలు పూర్తి చేయాలని కొత్త షెడ్యూల్ విడుదల చేశారు. అయితే రాష్ట్రంలో నెలకొన్న తుఫాన్, వరదల కారణంగా రెండోసారి వాయిదా వేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హెచ్చెల్సీ పరిధిలో 99, మైనర్ ఇరిగేషన్ పరిధిలో 95 మొత్తం 194సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వ హణకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. తదుపరి ఎన్నికల తేదీలను త్వరలో ప్రకటిస్తామని ఉమ్మడి జిల్లా జలవనరుల శాఖ ప్రాజెక్టుల సీఈ నాగరాజ తెలిపారు.

బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాస్కెట్‌బాల్ సీనియర్ పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన జట్ల వివరాలను జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హబీబుల్లా, నరేంద్రచౌదరి మంగళవారం స్థానిక అశోకనగర్ డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో ప్రకటించారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబరు 6 నుంచి 9 వరకు పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు.

జట్ల వివరాలు

మహిళా జట్టు: సోహానా, యశశ్విని, మేఘన, వైష్ణవి, పరిమళ, దేదీప్య సాయి, సాయిజ్యోతిక, హిమవర్షిత, పల్లవి, నందిని, కిరణ్మయి, నిక్షశ్రీ.
పురుషుల జట్టు: సాదిక్, సతీష్, సత్యప్రకాష్, ద్వారకా, నరసింహులు, సంజయ్, భాషా, సిద్దు, నయాన్‌భాషా, వివేక్, కృష్ణా రెడ్డి, సంతోష్, వాసన్‌రామ్.

ఆగని కర్ణాటక మద్యం

బెల్టుషాపుల చాటున విక్రయాలు

దాడులు చేస్తున్నా బెదరని వైనం

నాయకుల కనుసన్నల్లోనే సరఫరా

చోద్యంచూస్తున్న ఉన్నతాధికారులు


పాలసముద్రంలో పట్టుబడిన కర్ణాటక మద్యం (ఫైల్)

హిందూపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటుతున్నా ఇప్పటికీ కర్ణాటక మద్యం జిల్లాలో ఏరులై పారుతోంది. గత వైసీపీ హయాంలో కర్ణాటక నుంచి మద్యం అక్రమంగా తీసుకొచ్చి విక్రయించిన వారే.. ప్రస్తుతం కూడా దర్జాగా తెస్తూ విక్రయాలు సాగిస్తున్నారు. యథేచ్ఛగా దందా సాగుతున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. తూతూమంత్రంగా దాడులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సాధారణంగా సరిహద్దు గ్రామాల్లో కర్ణాటక మద్యం తెస్తుంటారు. జిల్లావ్యాప్తంగా సరఫరా అవుతోందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ అక్రమ రవాణాలో కూటమి నాయకుల హస్తం పుష్కలంగా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు ఇటీవల పట్టుబడుతున్న దాఖలాలే నిదర్శనాలు. కొన్నిచోట్ల అధికారులు దాడులు చేస్తున్నా అక్రమంగా మద్యాన్ని తీసుకొచ్చే వారు బెదరట్లేదు. కర్ణాటక నుంచి దర్జాగా మద్యం తీసుకొస్తూ రూ.లక్షలు వెనకేసుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బెల్టుషాపు చాటున విక్రయాలు

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో నూతన ఎక్సైజ్ విధానాన్ని తీసుకొచ్చారు. ఆ మేరకు మద్యం షాపులను లైసెన్స్‌దారులు నిర్వహిస్తున్నారు. నిబంధనలు తుంగలోతొక్కి. జిల్లావ్యాప్తంగా బెల్టుషాపులు ఏర్పాటు చేసుకుని, విక్రయాలు సాగిస్తున్నారు. గతంకంటే ప్రస్తుతం బెల్టుషాపులు ఎక్కువగానే ఉన్నాయని చెప్పవచ్చు. జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలు, మండలాలు, పల్లెల్లో నిర్వహిస్తున్నారన్నది బహిరంగ రహస్యమే. బెల్టుషాపులు నిర్వహించే కొంతమంది ఏపీ మద్యం అమ్మితే వచ్చే లాభం కొంతేనంటూ కర్ణాటక మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని తెలుస్తోంది. ఏపీ మద్యం ఒక కేసు తీసుకెళ్తే కర్ణాటక సరుకు మూడు కేసులు తెచ్చుకుంటున్నట్లు సమాచారం. సరిహద్దు కర్ణాటకలోని మద్యం షాపుల్లో వ్యాపారాలు తగ్గకపోవడమే ఇందుకు నిదర్శనం. గతంలోకంటే ఇప్పుడే కొంత మేర పెరిగినట్లు సమాచారం. ఆ మద్యమంతా జిల్లాలోకి వస్తున్నట్లు ఇక్కడ షాపులు నిర్వహించే లైసెన్స్‌దారులే పేర్కొనడం గమనార్హం.

దాడులు చేస్తున్నా...

అధికారులు దాడులు చేస్తున్నా అక్రమంగా మద్యం తీసుకొచ్చేవారు మాత్రం బెదరట్లేదు. వారి వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. ఇటీవల హిందూపురం, పెనుకొండ, మడకశిరలో ఎక్సైజ్ అధికారులు వరుస దాడులు చేస్తున్నారు. ఈ దాడుల్లో భారీ ఎత్తున కర్ణాటక మద్యం పట్టుబడుతోంది. అయినా కర్ణాటక నుంచి మద్యం తెచ్చేవారు బెదరడం లేదు. ఇటీవల ఎక్సైజ్ పోలీసులకు కర్ణాటక నుంచి మద్యం తెచ్చే వ్యక్తి పట్టుబడ్డాడు. అతను గతంలో కూడా పలుసార్లు ఎక్సైజ్ అధికారులకు చిక్కాడు. వదిలేసిన మరుసటి రోజే కర్ణాటక మద్యాన్ని దర్జాగా తీసుకొచ్చి, విక్రయాలు సాగించాడు. దీనిని బట్టి కర్ణాటక మద్యం వ్యాపారంలో ఎంత లాభం ఉందో అర్థం అవుతుంది. అక్కడ ఓ టెట్రా ప్యాకెట్ రూ.60నుంచి రూ.70కు కొనుగోలు చేస్తే ఇక్కడ రూ.120 నుంచి రూ.130కు విక్రయిస్తారు. ఒక కేసులో 48 టెట్రాప్యాకెట్లు ఉంటాయి. ఆ లెక్కన చూస్తే ఓ బాక్సుపై రూ.2వేల దాకా ఆదాయం ఉంటుంది. ఖర్చులు పోయినా రూ.1500కు తగ్గదు. రోజుకు 10 నుంచి 20బాక్సులు విక్రయించేవారున్నారు. ఇటీవల పట్టుబడినవారిలో కొంతమంది ఆదాయం నెలకు రూ.2లక్షల నుంచి రూ.3లక్షలదాకా ఉన్నట్లు పోలీసుల సమక్షంలో ఒప్పుకున్నట్లు తెలిసింది. దీంతో సునాయాసంగా డబ్బు వెనకేసుకోవచ్చన్న ఆశతో కర్ణాటక మద్యం వ్యాపారం సాగిస్తున్నారు.

నాయకుల కనుసన్నల్లోనే..

జిల్లాలో కొన్నిచోట్ల కూటమి నాయకుల సహకారంతో కర్ణాటక మద్యం వ్యాపారం సాగుతోందన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. మరి కొన్నిచోట్ల వైసీపీ, కూటమి నాయకులు కలిసి చేయిస్తున్నట్లు తెలిసింది. కొన్ని పల్లెల్లో బెల్టుషాపులు నిర్వహించే వారు చోటామోటా నాయకులకు నెలకు రూ.10వేల నుంచి రూ.15వేలదాకా ఇస్తున్నట్లు సమాచారం. ఆదాయం వస్తుందని కొన్నిచోట్ల అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఏకమై సజావుగా సాగిస్తున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

దాడులు చేస్తున్నాం..

కర్ణాటక మద్యానికి అడ్డుకట్ట వేసేదిశగా నిత్యం దాడులు చేస్తున్నాం. రోజూ ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. కర్ణాటక మద్యం తీసుకొస్తే కఠినంగా వ్యవహరిస్తాం. పదేపదే పట్టుబడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తాం.

-లక్ష్మీదుర్గయ్య, ఎక్సైజ్ సీఐ

ఎన్నిసార్లు తిరగాలి..?

బర్త్ సర్టిఫికెట్ల కోసం రోడ్డెక్కిన దరఖాస్తుదారులు


తాడిపత్రి రోడ్డుపై బైఠాయించిన దరఖాస్తుదారులు

బత్తలపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జనన ధ్రువీకరణ పత్రాల కోసం ఎన్నిసార్లు తిరగాలని దరఖాస్తుదారులు మండిపడ్డారు. సర్టిఫికెట్ల జారీలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మంగళవారం స్థానిక తాడిపత్రి రోడ్డులో బైఠాయించి, నినాదాలు చేశారు. స్థానిక ఆర్డీటీ ఆస్పత్రిలో జన్మించిన వారందరికీ బత్తలపల్లి సచివాలయం1లో జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు. జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర ప్రాంతాల వారు కూడా పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా బర్త్ సర్టిఫికెట్లు మాత్రం ఇవ్వట్లేదని దరఖాస్తుదారులు మండిపడ్డారు. విద్యార్థులకు ప్రస్తుతం అపార్ నమోదు చేస్తున్నారనీ, అందుకు తప్పుల్లేని జనన ధ్రువీకరణ పత్రం అవసరమవడంతో రోజూ సచివాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నామన్నారు. అదనపు సిబ్బందిని నియమించి, సమస్య పరిష్కరించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగికి దరఖాస్తులు ఇచ్చామనీ, ఒకటో తేదీ నుంచి ఆయనను తొలగించడంతో మళ్లీ ఇవ్వమంటున్నారని వారు వాపోయారు. కూడేరుకు చెందిన ఫరీదా మాట్లాడుతూ.. జనన ధ్రువీకరణ పత్రం కోసం ఐదు నెలలుగా తిప్పుకుంటున్నారని తెలిపారు. 3 నెలలగా తిప్పుకుంటున్నారని నల్లమాడకు చెందిన బయపురెడ్డి వాపోయారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి, సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఇద్దరు పెళ్లాల ముద్దుల దొంగ..!

ఏడుగురు పిల్లలతో పోషణభారం

దిక్కుతోచక చోరీలకు దిగిన పెయింటర్

ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో 41 కేసులు

మరో ఇద్దరితో కలిపి పట్టుకున్న పోలీసులు

31తులాల బంగారం.. కారు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, కారు, బైక్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జగదీష్

క్రైంకార్నర్

అనంతపురం క్రైం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసులు ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి 310 గ్రాముల బంగారు ఆభరణాలు, కారును స్వాధీనం చేసుకున్నారు. దొంగల ముఠా నాయకుడు షేక్ ఖాజా పీరాపై ఏపీ, కర్ణాటక, తెలంగాణలో మొత్తం 41 కేసులు ఉన్నాయి. అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జగదీష్ నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి, కేసుల వివరాలు వెల్లడించారు. వివిధ రాష్ట్రాలలో దొంగతనాలకు పాల్పడుతున్న శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన షేక్ ఖాజాపీరా, మహేష్, జమీర్‌ను అరెస్టు చేశామని తెలిపారు.

జైలుకు వెళ్లొచ్చాక జతగాళ్లు

ముఠా నాయకుడు షేక్ ఖాజాపీరా వృత్తి రీత్యా పెయింటర్. ఇతనికి ఇద్దరు భార్యలు, ఏడుగురు పిల్లలు. పెయింటింగ్ ద్వారా వచ్చే డబ్బు సరిపోకపోవడంతో దొంగతనాలు ప్రారంభించాడు. 2021 నుంచి తాళం వేసిన ఇళ్లకు ఒక్కడే వెళ్లి చోరీలకు పాల్పడేవాడు. అనంతపురం జిల్లా సహా రాష్ట్రంలో 14, కర్ణాటకలోని బాగేపల్లిలో 4, కోలార్ జిల్లాలో 5, తెలంగాణలోని షంషాబాద్‌లో 4 దొంగతనాలు చేశాడు. అప్పట్లో నమోదైన ఈ 27 కేసులలో జైలుకు వెళ్లి.. ఈ ఏడాది మార్చిలో బయటకు వచ్చాడు. ఆ తరువాత కూలి పనులకు వెళ్లే మహేష్, జమీర్‌ను కలుపుకుని దొంగతనాలను తిరిగి ప్రారంభించాడు. అనంతపురం రూరల్, త్రీటౌన్, ఫోర్త్‌టౌన్, యాడికి, ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో 10 దొంగతనాలు, కర్ణాటకలోని కోలార్ జిల్లాలో 4 దొంగతనాలు చేశారు. వీరు కారును బాడుగకు తీసుకుని వెళ్లి చోరీలకు పాల్పడేవారు. జమీర్ డ్రైవింగ్ చేసేవాడు. తాళం వేసిన ఇళ్లను ఎంపిక చేసుకున్న తరువాత.. మహేష్, జమీర్ బయటే ఉండి ఎవరూ రాకుండా నిఘా ఉంచుతారు. ఖాజా ఒక్కడే ఇంట్లోకి వెళ్లి విలువైన ఆభరణాలను ఎత్తుకొచ్చేవాడు. వీరిపై అనంతపురం సీసీఎస్ పోలీసులు, రూరల్ పోలీసులు నిఘావేసి అరెస్టు చేశారు.

మరో చోరీ కోసం వచ్చి..

అనంతపురం నగర శివారులో మరో చోరీ కోసం ముఠా ప్రయత్నిస్తూ పోలీసుల కంట పడింది. కళ్యాణదుర్గం రోడ్డులోని రజాక్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఓ కారు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు వాహనంతో పాటు ఆ ముగ్గురినీ అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో వ్యవహారం బయటపడింది. సీసీఎస్ సీఐ ఇస్మాయిల్, రూరల్ సీఐ శేఖర్, ఎస్ఐ రాంబాబు వారిని అరెస్టు చేశారు. వారితోపాటు హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, మల్లికార్జున, చంద్రశేఖర్, గిరిబాబు, జయకర్, కానిస్టేబుళ్లు శివయ్య, పాండవ, ఆంజనేయప్రసాద్, రంజిత్, బాలకృష్ణ, షామీర్, రాజశేఖర్‌ను ఎస్పీ అభినందించారు.

కొత్త సెక్షన్ కింద..

నిందితులపై బీఎన్ఎస్ చట్టం కింద కేసు నమోదు చేశామని ఎస్పీ జగదీష్ తెలిపారు. ఆర్గనైజ్డ్ క్రైం కింద యావజ్జీవ కారాగార శిక్ష పడే సెక్షన్ కింద వీరిని రిమాండ్‌కు పంపుతామని తెలిపారు. దొంగతనం కేసుల్లో ఇదివరకు ఐదేళ్లు, ఏడేళ్ల జైలు శిక్ష పడేదని, ఇప్పుడు శిక్ష మరింత కఠినతరమైందని తెలిపారు. ఊళ్లకు వెళ్లే సమయంలో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌ను ఉపయోగించుకోవాలని ప్రజలకు ఎస్పీ సూచించారు. పోలీసులకు సమాచారం ఇస్తే.. ఆ ఇంట్లో కెమెరా ఇన్‌సర్ట్ చేస్తారని, ఇంట్లోకి దొంగలు వస్తే రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవచ్చని తెలిపారు. అల్మారా, బీరువాలకు తాళం వేయకుండా నిర్లక్ష్యం వహిస్తుంటారని, అలా చేయొద్దని సూచించారు. బంగారు ఆభరణాలను లాకర్లలో పెట్టాలని సూచించారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. యువకుడి మృతి


జయశంకర్ (ఫైల్)

నార్పల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చుకుంటపల్లి గ్రామ సమీపంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని తలారి జయశంకర్(36) మృతి చెందాడు. గూగూడు గ్రామానికి చెందిన తలారి జయశంకర్ తన ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం రామాపురానికి వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకొని తిరిగి వస్తుండగా మార్గమధ్యలో పుచ్చుకుంట పల్లి గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ అతడిని 108 వాహనంద్వారా అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడు గూగూడు కుళ్లాయిస్వామి దేవస్థానంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడికి భార్య త్రివేణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాగర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతానికి యువకుడి బలి


వెంకటేష్ (ఫైల్)

పామిడి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నారాయణస్వామివీధి(మార్కెట్)లో విద్యుదాఘాతంతో వెంకటేష్(24) సోమవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన మిద్దే రామాంజనేయులు కుమారుడు వెంకటేష్ స్థానిక నారాయణస్వామి వీధిలో తన స్నేహితులతో కలిసి మాట్లాడుతుండగా వర్షం వచ్చింది. దీ దంతో పక్కనే ఉన్న రేకుల షెడ్డులోకి వెళ్లారు. అయితే ఆ రేకుల షెడ్డుకు విద్యుత్ సరఫరా అవుతుండటంతో ఇనుప పైపునకు ఆనుకొని ఉన్న వెంకటేష్ షాక్‌కు గురయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న వెంకటేష్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రి సిబ్బంది పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి తండ్రి ఎనిమిదేళ్ల కిందటే మృతి చెందాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లి లక్ష్మీదేవి అనాథగా మారింది.

వ్యక్తి ఆత్మహత్య


బోయ నాగరాజు (ఫైల్)

గుమ్మఘట్ట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగసముద్రం గ్రామంలో మంగళవారం సాయంత్రం బోయ నాగరాజు(40) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు నాగరాజు మేస్త్రీ పని చేసేవాడు. ఈక్రమంలోనే కొంతకాలం కిందట ఉపాధి కోసం బెంగళూరుకు వెళ్లాడు. అయితే కడుపునొప్పితో బాధపడుతూ కొన్ని రోజుల కిందట తిరిగి స్వగ్రామానికి చేరుకున్నాడు. కడుపునొప్పి మంగళవారం తీవ్రం కావడంతో భరించలేక ఇంట్లో భార్య నాగమ్మ, పిల్లలు బయటకు వెళ్లిన సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య నాగమ్మ, ఇద్దరు కుమారులున్నారు. గుమ్మఘట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హమ్మయ్యా...!

- పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- బాధిత కాంట్రాక్టర్లలో సంతోషం


జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ కార్యాలయం

అనంతపురం సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలతో ఆగిపోయిన బిల్లులకు ప్రస్తుతం మోక్షం లభిస్తోంది. 2014-18 మధ్యలో పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కాంట్రాక్టర్లకు గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా చెల్లించని విషయం తెలిసిందే. బిల్లుల కోసం వారు పదేపదే కార్యాలయాలు చుట్టూ తిరిగిన ఫలితం లేకుండా పోయింది. కనీసం ఒక్కొక్కరికి 20 శాతం బిల్లులైన చేసి ఉంటే కొంతైనా ఊరట కలిగేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 441 పనులకు సంబంధించి రూ.2.99 కోట్ల బిల్లులను గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. అయితే కూటమి ప్రభుత్వం బాధిత కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించే విధంగా ఈనెల 15న ఆశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసిది. దీంతో ఆయా కాంట్రాక్టర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి సమగ్ర నివేదిక

గత టీడీపీ పాలనలో చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా వైసీపీ ప్రభుత్వం వేధించడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారు. దీన్ని గ్రహించిన ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ బిల్లుల కోసం వైసీపీ సర్కార్ చుట్టూ తిరగొద్దని, టీడీపీ అధికారంలోకి రాగానే అన్ని క్లియర్ చేస్తామని అప్పట్లోనే హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపునకు సిద్ధమైంది. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగానే.. ఆశాఖ అధికారులు సైతం చకచక పెండింగ్ బిల్లుల వివరాల సమగ్ర నివేదికను అందజేశారు.

ప్రభుత్వానికి అందజేశాం

2014-18 మధ్యలో జరిగిన పనులకు గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిన విషయం వాస్తవమే. చాలా మంది కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం పెండింగ్ బిల్లులను చెల్లిస్తామని చెప్పడంతో వెంటనే సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేశాం. త్వరలోనే బిల్లులు చెల్లించే అవకాశం ఉంది.

- జహీర్ అస్లాం, ఎస్ఈ, జిల్లా పంచాయతీరాజ్‌శాఖ

పంటనష్టం నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టండి

జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రామసుబ్బయ్య

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతాంగం పంటనష్టం నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రామసుబ్బయ్య మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. వరిపంట ప్రస్తుతం గింజ గట్టిపడే దశ నుండి కోతదశకు చేరుకుందన్నారు. ప్రస్తుతం పంటను కోయరాదన్నారు. ఇంతకుముందే కోసినట్లయితే గింజలు నల్లబడకుండా, మొలకెత్తకుండా ఎకరాకు 20 కేజీల ఉప్పుద్రావణం చల్లుకోవాలన్నారు. గింజదశలో వరిపంట పడిపోయినట్లయితే నీరు బయటకు వెళ్లేలా చేయాలన్నారు. గింజలు మొలకెత్తకుండా ఐదు శాతం ఉప్పుద్రావణం వెన్నులపైన పిచికారీ చేయాలని సూచించారు. తద్వారా గింజలు మొలకెత్తవన్నారు. అలాగే జిల్లాలో కందిపంట పూత నుంచి కాయదశకు వచ్చిందన్నారు. వర్షాలకు పూత రాలకుండా ప్లానోఫిక్స్ మిల్లీలీటరు మందును నాలుగు లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. పూత రాకపోతే పొటాషియం నైట్రేట్ ఐదు గ్రాముల మందును లీటరు నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కందిలో మచ్చమార్కుల పురుగు ఉన్నట్లయితే క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీమీటర్లు లేదంటే హసిఫేట్ 1.5 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వర్షాలు ముఖ్యంగా వేరుశనగ, మొక్కజొన్న, వరి, శనగ పంటలకు అనుకూలమని ఆయన పేర్కొన్నారు.


ఆటోడ్రైవర్‌పై దాడి

అనంతపురం క్రైం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్‌పై ముగ్గురు దాడి చేసిన ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అశోకనగర్‌లో మినర్వాస్కూల్ సమీపంలో ఆటోను రోడ్డుకు అడ్డంగా పెట్టాడనే కారణంతో రిజ్వాన్‌పై అన్వర్, మన్సూర్, ఇక్బాల్ హుస్సేన్ దాడి చేశారు. చంపుతామని బెదిరిస్తూ కొట్టారనే ఫిర్యాదుపై మూడు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

మామా, అల్లుళ్ల గొడవపై కేసు

రామగిరికి చెందిన బాబయ్య శారదానగర్‌లో నివాసముంటున్నాడు. కుమార్తెను నేతాజీనగర్‌కు చెందిన రహంతుల్లాకు ఇచ్చి కొంతకాలం క్రితం పెళ్లి చేశాడు. మామ, అల్లుడు రహంతుల్లా మధ్య ముందునుంచే మనస్పర్థలుండేవి. అక్కంపల్లిలో గతనెల 10న ఓ శుభకార్యం ఉందని, తన కుమార్తెను పంపమని కోరాడు. ఈక్రమంలో మామా,అల్లుళ్ల మధ్య మాటామాటా పెరిగి రహంతుల్లా బాబయ్యను తోసేశాడు. బాబయ్య ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి అదృశ్యం


రాజశేఖర్

బుక్కరాయసముద్రం మండలం రేకులకుంటకు చెందిన రాజశేఖర్, అతడి భార్య మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో మంగళవారం నగరంలోని నేతాజీనగర్‌లో ఉంటున్న తన సోదరి ఇంటికి వచ్చాడు. ఇంటి నుంచి చెప్పకుండా అదృశ్యమయ్యాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్తం

సల్లాపురమ్మకు ప్రత్యేక పూజలు



రాప్తాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదపల్లిలో వెలసిన సల్లాపురమ్మ దేవతకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సల్లాపురమ్మ, పోతులయ్య స్వామికి భక్తులు బోనాలు సమర్పించి విశేష పూజలు చేశారు. గ్రామ ప్రజలు ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు పొట్టేళ్లు, మేకలను బలి ఇచ్చారు.

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డి-1 సెక్షన్ ఏఈఈ వి. నీలకంఠం తెలిపారు. 11కేవీ వినాయకనగర్ ఫీడర్ పరిధిలోని మున్నానగర్, అంబేద్కర్ నగర్, మోమిన్ నగర్, మటన్‌మార్కెట్, అంబరపు వీధి, భవాని నగర్, కేవీఎస్ నగర్, గిరిప్రసాద్ నగర్, దక్షిణామూర్తి నగర్, వీరభద్ర కాలనీ, మునలమ్మకట్ట, తాడిపత్రిరోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు ప్రజావేదిక

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకానికి సంబంధించి స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో బుధవారం బహిరంగ ప్రజావేదికను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివ శంకరప్ప, ఏపీఓ గోవిందరాజ్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమవుతుందన్నారు. నవంబరు 23 నుంచి ఈనెల 3వతేదీ వరకు మండలంలో 17వవిడత సామాజిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.

ఎఫ్‌పీ షాపుల్లో తనిఖీలు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో విజిలెన్స్ అధికారులు ఎఫ్‌పీ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. శ్రీసత్యసాయి జిల్లాలోని అమరాపురం మండలం తమిడేపల్లి, అమరాపురంలోని ఇందిరమ్మ కాలనీలోని ఎఫ్‌పీ షాపుల్లో తనిఖీలు చేపట్టారు. రికార్డులను, స్టాకును పరిశీలించినట్లు సీఐ జమాల్‌బాష తెలిపారు. ఎక్కువ వ్యత్యాసాలు ఉండడంతో భౌతిక నిల్వలను స్వాధీనం చేసుకొని స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు. ఈ తనిఖీల్లో డీసీటీఓ సురేష్, అమరాపురం సీఎస్‌డీటీ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

'ఏఈ అందుబాటులో ఉండరు'

రాప్తాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల విద్యుత్‌శాఖ ఏఈ శివప్రసాద్ ప్రజలు, రైతులకు అందుబాటులో ఉండరని పుల్లలరేవు గ్రామస్థులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. రాప్తాడులోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఏఈ అందుబాటులో ఉండరని, ఫోన్ చేసినా సమాధానం చెప్పరని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు గోపాల్, అక్కులప్ప, జగన్‌మోహన్‌రెడ్డి, కిష్టయ్య, రవి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

అనంతపురం క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శ్రీకంఠం సర్కిల్‌లోని ఓ లాడ్జిలో పేకాడుతుండగా వన్‌టౌన్ పోలీసులు ఏడుగురిని అరెస్ట్ చేశారు. సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ ఆదేశాల మేరకు మంగళవారం దాడులు నిర్వహించారు. శ్రీకంఠం సర్కిల్‌లోని లాడ్జిలో పేకాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి. రూ.30200 స్వాధీనం చేసుకున్నారు.

బెల్టుషాపులపై కొరడా

గార్లదిన్నె డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బుక్కరాయసముద్రం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలో బెల్టుషాపులు నిర్వహిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు బుక్కరాయసముద్రం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ నాగసునీత తెలిపారు. మంగళవారం గార్లదిన్నె మండలంలోని పెనకచెర్ల డ్యాం గ్రామానికి చెందిన మహిళ వద్ద 27 మద్యం (180మిలీ) బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. గార్లదిన్నెలో ఓ వ్యక్తి వద్ద 35 మద్యం బాటిళ్లు, ద్విచక్రవాహనం సీజ్ చేశారు. బుక్కరాయసముద్రం మండలంలోని కొట్టాలపల్లిలో ఓ మహిళ వద్ద నుంచి 13 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు..

పొట్టేళ్ల అపహరణ

నార్పల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గవ్వల వీధిలో ఉంటున్న శ్రీకాంత్ అనే రైతుకు చెందిన రెండు పొట్టేళ్లను సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. శ్రీకాంత్ తన ఇంటి ఆవరణంలో షెడ్డును ఏర్పాటు చేసుకుని, అందులో 40 పొట్టేళ్లు ఉంచాడు. గుర్తుతెలియని వ్యక్తులు షెడ్డు తాళాలు పగులకొట్టి రెండు పొట్టేళ్లను ఎత్తుకెళ్లారు. తెల్లవారుజామున గమనించాననీ, విలువ రూ.40వేలు ఉంటుందని తెలిపాడు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో సామగ్రి చోరీ

రాప్తాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాప్తాడు రైల్వే గేటు సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లోని సామగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని విద్యుత్ శాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు. చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని వైండింగ్ వైరు, ఆయిల్ చోరీ చేశారన్నారు.

విద్యార్థినుల భద్రతపై నిర్లక్ష్యం

- హాస్టళ్లలో నిబంధనలు గాలికి
- పర్యవేక్షణాధికారులు, వార్డెన్ల వైఫల్యం



బాలికల వసతి గృహ సముదాయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థినులకు వసతి, భోజనం, విద్య ఏ స్థాయిలో అమలు పరుస్తారో.. వారి భద్రత విషయంలోనూ అదేస్థాయిలో చర్యలు చేపటాలి. తమ సొంత బిడ్డల్లా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత వార్డెన్లపై ఉంటుంది. అయితే కొందరు వార్డెన్లు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం విద్యార్థినులు ఉండే వసతిగృహాల్లోకి సాయంత్రం 6 గంటల తరువాత ఎవరికీ అనుమతి ఉండదు. జిల్లాలోని పలు వసతిగృహాల్లో అమలు కావడం లేదనే చెప్పాలి. సాయంత్రం 7.30 తరువాత కూడా అన్న, తమ్ముడు, బంధువులంటూ హాస్టల్లోకి వెళ్లి వస్తున్నారు. మరికొన్ని చోట్ల విద్యార్థినులు తినుబండారాలు కొనేందుకు రాత్రి 8 గంటల సమయంలో హాస్టల్ దాటి బయటికొస్తున్నారు. ఆయా హాస్టళ్ల వార్డెన్ల నిర్లక్ష్య వైఖరి, పర్యవేక్షణాధికారులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటం ఇందుకు కారణమని చెప్పాలి.

గతంలో ఘటనలు...

గతంలో ఎస్సీ బాలికల వసతిగృహాల నుంచి కొందరు విద్యార్థినులు మిస్సింగ్ అయిన ఘటనలు చోటు చేసుకున్నాయి. మరికొంత మంది విద్యార్థినులు మృత్యువాత పడిన సందర్భాలున్నాయి. తమ చెల్లెలిని ఊరికి తీసుకెళ్తానని చెప్పి ఓ అబ్బాయి ఇంటర్ విద్యార్థినిని హాస్టల్ నుంచి పిలుచు కెళ్లాడు. ఆ సమయంలో ఆ విద్యార్థిని మృతి చెందింది. మరో డివిజన్‌లోని ఓ ఎస్సీ విద్యార్థిని విషయంలోనూ ఇలాగే జరిగింది. ఆ విద్యార్థిని సైతం తమ బంధువులు వచ్చారంటూ చెప్పి హాస్టల్ నుంచి వెళ్లింది. కానీ ఇంటికెళ్లలేదు. దాదాపు వారం తరువాత ఆ విద్యార్థిని ఆచూకీ కనుగొని హాస్టల్‌కు తీసుకొచ్చారు. ఇదిలా ఉంటే హాస్టల్‌లో నీళ్లు లేవంటూ గత యేడాది ఓ అర్ధరాత్రి విద్యార్థినులు హాస్టల్ నుంచి బయటికొచ్చి నీటిని పట్టుకెళ్లిన సంఘటన ఉంది. ఆ సమయంలో ఆ విద్యార్థినులకు ఏదైనా ప్రమాదం జరిగిఉంటే అన్న వాదనలు అప్పట్లో బలంగా వినిపించాయి. వీటన్నిం టికి వార్డెన్ల నిర్లక్ష్య వైఖరి కారణమని తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.

ఇప్పటికైనా ఆయా సంక్షేమశాఖల అధికారులు విద్యార్థినుల వసతిగృహాల విషయంలో నిబంధనలను కట్టుదిట్టం చేసి, వారి భద్రతను పటిష్ఠ పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిబంధనలు పాటించడంలేదు



ప్రభుత్వ వసతిగృహాల్లో సాయంత్రం 6 గంటల తరువాత విద్యార్థినులు బయటకు రాకూడదన్న నిబంధనలు ఉన్నాయి. వాటిని వసతి గృహాల అధికారులు తుంగలో తొక్కి విద్యార్థిని, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. వసతిగృహాల నిబంధనలు కచ్చితంగా పాటించాలి. గతంలో చాలామంది విద్యార్థినులు బంధువు లొచ్చారంటూ హాస్టల్ నుంచి బయటికి వెళ్లి మృతిచెందిన సందర్భాలున్నాయి. వార్డెన్లు, పర్యవేక్షణాధికారులు సాయంత్రం 6 పైన వసతిగృహాల నుంచి విద్యార్థులు బయటి వచ్చేందుకు అనుమతివ్వకూడదు. వారి తరపున ఎవరొచ్చినా వారికి కూడా నిబంధనలు వర్తింపజేయాలి.

- పాపిరెడ్డిపల్లి పృథ్వీ, జిల్లా ప్రధాన కార్యదర్శి, అఖిలభారత విద్యార్థి బ్లాక్

సభ్యత్వ నమోదును వేగవంతం చేద్దాం

పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే శ్రావణిశ్రీ సూచన



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు శ్రావణిశ్రీ, ఎంఎస్ రాజు, ద్విసభ్య కమిటీ సభ్యులు

శింగనమల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నియో జకవర్గంలో వేగ వంతం చేస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మండలంలోని నాయనవారిపల్లిలో టీడీపీ మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి ఎమ్మెల్యేలు బండారు శ్రావణిశ్రీ, ఎంఎస్ రాజు, ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కార్యకర్తలతో మాట్లాడుతూ... టీడీపీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గం కంచుకోట గా ఉందన్నారు. క్రియాశీలక సభ్యత్వం ద్వారా ప్రమాద బీమా కల్పించడంతో రాష్ట్ర వ్యాప్తంగా కార్యకర్తల్లో జోష్ కనిపించిందన్నారు. నియోజకవర్గంలో ఎక్కు వ శాతం సభ్యత్వాలు నమోదు చేద్దామన్నారు. ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదులో ముందు వరుసలో ఉండాలని సూచించారు. తెలుగుయవత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి, మాజీ జడ్పీటీసీ షాలిని, నాయకులు ఈశ్వర్‌రెడ్డి, మారుతినాయుడు, చితంబరిదొర, గుర్రం లక్ష్మీనారాయణ, మాసూల చంద్ర ప్రసాద్‌నాయుడు, మల్లికార్జున నాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సమక్షంలో నిదనవాడ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రమౌళిరెడ్డి టీడీపీలో చేరారు. నిదనవాడకు చెందిన టీడీపీ నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, గుత్తిరెడ్డి, సుధీర్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వారు చేరారు. నాయనవారిపల్లి నుంచి నిదన వాడకు వచ్చిన ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ సొంత ఊరైన బుక్కరాయసముద్రం మండలం సిద్దరాంపురం నుంచి వంద కుటుంబాలు టీడీపీ లో చేరాయి. వారికి ఎమ్మెల్యేతో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు ముంటి మడుగు కేశవరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా నాయకులు పసువుల శ్రీరామిరెడ్డి మండల కన్వీనర్ ఆశోక్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

బస్సులను ప్రారంభించిన ఆర్టీసీ జోనల్ చైర్మన్



బస్సులను ప్రారంభిస్తున్న పూల నాగరాజు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు నూతన ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ సమక్షంలో పూల నాగరాజు మూడు ఎక్స్‌ప్రెస్ బస్సులు, రెండు పల్లెవెలుగు బస్సులను ప్రారంభించారు. కార్యక్రమంలో విజయవాడ జోనల్ చైర్మన్ అప్పలనాయుడు, నెల్లూరు జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి తదితర ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

రక్తనిధి స్టాఫ్‌కు అభినందనలు

అనంతపురంటౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అనంత సర్వజనాస్పత్రి రక్తనిధి డాక్టర్లు, సిబ్బందిని సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు అభినందించారు. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకు జిల్లాలో 43 రక్తదాన శిబిరాలు నిర్వహించారు. వీటి ద్వారా 9645 బ్లడ్ యూనిట్లను సమకూర్చుకున్నారు. అవసరమైన 7704 మంది రోగులకు, పలువురికి ఆపరేషన్ సమయంలోను రక్తం వినియోగించారు. అలాగే 1077మందికి ప్లేట్ లెట్లు అందించారు. ఈ నేపథ్యంలో అనంత ఆస్పత్రి రక్తనిధికి రాష్ట్రవైద్యశాఖ ఉత్తమ అవార్డును ప్రకటించింది. దీంతో మంగళవారం సూపరింటెండెంట్ ప్రశంసాపత్రంను అందజేసి రక్తనిధి విభాగం అధికారి డాక్టరు శ్రీనివాసులు ఇతర టెక్నీషియన్‌లను అభినందించారు.

ఆస్పత్రిలో పరిశుభ్రత పాటించాలి

ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న రోగులకు అపరిశుభ్రత వల్ల మరో ఇన్‌ఫెక్షన్ రాకుండా చూడాలని డాక్టర్లకు సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఆయన మంగళవారం తన చాంబర్‌లో అన్ని విభాగాల హెచ్‌ఓడీ లతో సమావేశం నిర్వహించారు. నిబంధనల మేరకు ప్రతి విభాగంలోను పరిశుభ్రత పాటించా లని సూచించారు. సమావేశంలో ఆర్‌ఎంఓలు డాక్టరు హేమలత, పద్మజ, శివకుమార్‌తో పాటు పలువురు హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

నిత్యం కొత్త అంశాలపై అభ్యసించాలి: జేఎన్‌టీయూ వీసీ

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నిత్య విద్యార్థిగా కొత్త అంశాలపై అభ్యసించిన అధ్యాపకులు బోధనా పద్ధతుల్లో ప్రగతిని సాధిస్తారని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు పేర్కొన్నారు. స్థానిక రాఘవేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యుటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్(రైపర్) కళాశాలలో మంగళవారం ఫాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు కార్యక్రమాన్ని ప్రారంభిం చి మాట్లాడారు. ఫార్మసీ రంగంలో నూతన పరిశోధనలకు పుష్కలమైన అవకాశాలు ఉంటాయని తెలిపారు. అనంతరం వీసీ సుదర్శనరావును కళాశాల ప్రిన్సిపాల్ పద్మనాభరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఉమామహేశ్వరరా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పద్మావతి యూనివర్సిటీ ప్రొఫెసర్ సుజాత, డాక్టర్ కుమార్, కళాశాల అధ్యాపకులు వినోద్, సోమశేఖర్, జూటూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డీపీఓ

నార్పల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయాన్ని డీపీఓ నాగరాజు నాయుడు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మేజర్ పంచాయతీలో డ్రైనేజీ, వీధిలైట్ల సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. అంతేకాకుండా మండలంలో పలు పంచాయతీలో సమస్యలను ఆయా సంబంధిత కార్యదర్శలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వర్ణపంచాయతీ పోర్టల్ అమలు తీరును, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని, ఈఎల్‌ఎస్‌ఆర్ ట్యాంకును పరిశీలించారు. సర్పంచు సుప్రియ, ఈఓఆర్డీ శైలజరాణి, పంచాయతీ కార్యదర్శి శ్యామల, పాల్గొన్నారు.

జీతాలు ఇప్పించాలని వేడుకోలు

అనంతపురం క్రైం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎనిమిది నెలలుగా జీతాలు రావడం లేదని నగరపాలిక పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలోని వాచ్‌మెన్లు, స్వీపర్లు ఆవేదన వ్యక్తం చేశారు. వాచ్‌మెన్లు, స్వీపర్లు మంగళవారం నగరపాలికకు వచ్చారు. అధికారులను కలిసి సమస్య వివరించారు. పార్ట్‌టైం ఉద్యోగులుగా పనిచేస్తున్న తమకు నెలకు రూ.4వేల వేతనం ఇస్తున్నారన్నారు. కానీ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జీతాలు రావడం లేదని వాపోయారు. అధికారులు న్యాయం చేయాలని కోరారు.

'ధర్నాచౌక్‌లో నిరసనకు అనుమతించండి'

అనంతపురం కల్చరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ల పనితీరుకు నిరసనగా ఈనెల 10వ తేదీన విజయవాడ నగరంలోని ధర్నాచౌక్‌లో నిరసన చేపట్టేం దుకు అనుమతించాలని ఫైట్ ఫర్ రైట్స్ సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షుడు కేపీ రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలోని సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్ సీఐని కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఫైట్ ఫర్ రైట్స్ సంఘం నాయకులు నవీన్ కుమార్, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

బాధితులకు సీపీఐ నేతల పరామర్శ



బాధితులతో మాట్లాడుతున్న జగదీష్

అనంతపురం విద్య, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పలు వేర్వేరు సంఘటనల్లోని బాధితుల ను సీపీఐ నాయకులు మంగళవారం పరామర్శించారు. స్థానిక చాకలి ఐలమ్మ కాలనీకి చెందిన బాలుడు కెనాల్‌లో గల్లంతైన విషయం విదితమే. అతడి తల్లిదండ్రులను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, ఏపీ చేతి వృత్తుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమయ్య పరామర్శించారు. మూడు రోజులుగా గల్లంతైన బాలుడు కనిపించకపోవడంతో కన్నీరుమున్నీరవు తున్న వారిని ఓదార్చారు. అలాగే యాడికి మండలం వేములపాడులో జరిగిన ఘర్షణలో గాయపడిన పెద్ద పుల్లారెడ్డి, చిన్న పుల్లారెడ్డి జిల్లా సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఇతర నేతలు పరామర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, ఏఐటీయూసీ ఆటో యూనియన్ నాయకులు దుర్గాప్రసాద్ ఇతర నేతలు పాల్గొన్నారు.

హైవేపై బ్లాక్‌స్పాట్లను పరిశీలించిన ఎస్పీ



రాప్తాడులో వై జంక్షన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం/రాప్తాడు, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): అనంతపురం మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి-44పై బ్లాక్ స్పాట్లను జిల్లా ఎస్పీ జగదీష్ ఎన్‌హెచ్‌ఏఐ, ఆర్టీఏ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. బ్లాక్ స్పాట్ల ప్రాంతాలైన రాప్తాడు జంక్షన్, అయ్యవారిపల్లి క్రాస్, తపోవనం కూడలి, శిల్పారామం సమీపంలోని బ్రిడ్జి కూడళ్లలో ఎస్పీ పర్యటించారు. జాతీయ రహదారిపై డ్రోన్లు ఆపరేట్ చేసి ప్రమాదాలకు కారణాలపై ఎస్పీ చూపించారు. రోడ్డు ప్రమాదాలు నియంత్రించాలంటే ఎలాంటి పరిష్కారాలు, ముందస్తు జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. అయ్యవారిపల్లి క్రాస్ వద్ద సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలన్నారు. ఆ క్రాస్ నుంచి రాప్తాడు హైవే వరకు హైవేపై ఉన్న మీడియన్స్ క్లోజ్ చేసి వాటి స్థానంలో ఐరన్ బ్యాడికేడింగ్ చే యాలని సూచించారు. సైన్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, క్యాట్ ఐస్, లైటింగ్, రంబబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలన్నారు. డీటీసీ వీరరాజు, రూరల్ డీఎస్పీ వెంకటేశులు, సీఐలు వెంకటేష్ నాయక్, శ్రీహర్ష, శేఖర్, రఘుప్రసాద్ తదితరులు ఉన్నారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్, డీజిల్‌లో కల్తీకి పాల్పడితే చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి (ఎస్పీ) వైబీపీటీఏ ప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం ఇతర సిబ్బందితో కలిసి జిల్లా కేంద్రంలోని పలు పెట్రోల్ బంకుల్లో తనిఖీలు చేపట్టారు. ఇంధన సాంద్రతను, క్వాంటిటీని, రికార్డులను, స్టాకును పరిశీలించారు. వినియోగదారులకు సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని వారికి సూచించారు. అయితే విజి లెన్స్ అధికారులు గుర్తించలేదేమో? చాలా వరకు పెట్రోల్ బంకుల్లో నిబంధనలు పాటిం చడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తనిఖీల్లో సీఐ శ్రీనివాసులు, తూనికలు కొలతల విభాగం అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్, ఏఓ వాసుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- దివ్యాంగుల దినోత్సవంలో జేసీ శివ్‌నారాయణ్ శర్మ



మూడు చక్రాల సైకిళ్లను పంపిణీ చేస్తున్న జేసీ

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ సూచించారు. స్థానిక ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనేక పథకాలను అమలుజేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారికి తగిన పరికరాలను ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మతో కలిసి మూడు చక్రాల సైకిళ్లను పంపిణీచేశారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సూరింటెండెంట్ వెంకటరమణ, విభిన్న ప్రతిభావంతుల సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచితంగా వెయ్యి మొక్కల పంపిణీ



మొక్కలను పంపిణీ చేస్తున్న సురేష్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రకృతి సంరక్షణ సమితి, ప్రాణదాత సోషియల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు సురేష్ కుమార్ మంగళవారం వెయ్యి మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. గత 18 ఏళ్లుగా సామాజిక సేవ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 3.5 లక్షల మొక్కలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

- చెన్నేకొత్తపల్లి: స్థానిక భవిత కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ-2 ప్రసూన్‌కుమార్‌నాయుడు, హెచ్ఎం విజయనిర్మల, ఎస్ఎంఎసీ చైర్మన్ ఓబుళపతి, ఐఈఆర్‌టీలు వెంకట లక్ష్మి, నాగేంద్ర, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఎమ్మార్సీసిబ్బంది పాల్గొన్నారు.
- రామగిరి: మండల కేంద్రంలో మంగళవారం సమగ్రశిక్ష ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. దివ్యాంగుల పిల్లలు తల్లిదండ్రులు, ఉన్నత పాఠశాలహెచ్ఎం ప్రసాద్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం హరిప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.
- శింగనమల: నియోజకవర్గ కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు నారాయణ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్‌టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

జాతీయ వ్యవసాయ విద్యా దినోత్సవం

అనంతపురం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు సమీపంలోని శ్రీకృష్ణదేవరాయ వ్యవసాయసాయ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ వ్యవసాయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యాలేరు ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఈకార్యక్రమాన్ని చేపట్టారు. కళాశాల అసోసియేట్ డీన్ రవీంద్రారెడ్డి హాజరై మాట్లాడారు. మొట్టమొదటి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి, మాజీ రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్‌కు నివాళులర్పించారు. వ్యవసాయ ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. ఆచార్యులు రామకృష్ణ, దీప, ఆదిత్య, రామాచారి, శ్రీలక్ష్మి, మౌనిక, కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి : ఏఓ

అనంతపురంరూరల్: రబీ క్రాప్ ఇన్సూరెన్స్‌ను రైతులు తప్పక చేసుకోవాలని ఏఓ శశికళ అన్నారు. మండలంలోని మన్నీల, ఉప్పరపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏ శశికళ హాజరై మాట్లాడారు.

- శింగనమల: రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలకు ఈక్రాప్ నమోదు తప్పనిసరిగా చేయిసుకోవాలని ఏఓ అన్వేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం తరిమెలలో ఈక్రాప్ ప్రకియను తనిఖీ చేశారు.


పారా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కోచ్‌లు, సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ క్రీడాకారుల పట్ల ఉన్న చిత్తశుద్ధితోనే ప్రభుత్వం పారా క్రీడాపోటీలు నిర్వహించి ప్రోత్సాహిస్తోందని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్రీడాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పారా క్రీడాకారులకు నిర్వహించిన అథ్లెటిక్ క్రీడాపోటీల్లో విజేతలకు మంగళవారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు, స్పందన ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చరణ్‌నంద చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. పారా క్రీడాకారులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన క్రీడా పాలసీ ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాప్ కోచ్‌లు మంజుల, లక్ష్మి, జెబీవుల్లా, ఆలీ, సుబ్రహ్మణ్యం, పారా క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆర్థిక సాయం



విద్యార్థులకు నగదు అందజేస్తున్న ప్రిన్సిపాల్ నాగరత్న

అనంతపురం విద్య, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు కేఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ బాలిక కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అండగా నిలిచారు. పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లడానికి ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు మంగళవారం సాయం అందించారు. కాలేజ్‌లో ఫస్ట్ ఇయర్ ఎంపీసీ చదువుతున్న విద్యార్థినులు భార్గవి, హెచ్ఈసీ చదువుతున్న సుస్మిత, గంగమ్మ, నాగరత్న జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. పంజాబ్‌లోని లూధియానాలో జరిగే నేషనల్ వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న విద్యార్థులకు ప్రిన్సిపాల్ నాగరత్న, తోటి అధ్యాపకులు రూ. 30 వేలు అందించారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చూపి, ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు చేయూత

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ కళాశాలలో చదువుతున్న మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులకు రిటైర్డ్ బాటనీ లెక్చరర్ ఎస్ సలాం ఆర్థిక చేయూతనందించారు. 17మంది విద్యార్థులకు రూ.2వేల చొప్పున సలామ్ విద్యాట్రస్ట్ ద్వారా అందించారు. మంగళవారం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఉర్దూ విభాగాధిపతి జంషీద్ బేగం, బాటనీ హెచ్‌ఓడీ అమృతలక్ష్మి ఆధ్వర్యంలో సలాం వారికి చెక్కులందజేశారు.

క్లుప్తంగా..

రోగులకు మెరుగైన సేవలు అందించాలి


రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్

ఉరవకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని సీహెచ్‌సీ ఆసుపత్రిని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. సాధ్యమైనంత వరకూ ఆసుపత్రిలో చికిత్సలు చేయాలని, అత్యవసరమయితే తప్పా రెఫర్ చేయరాదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటస్వామి చౌదరి పాల్గొన్నారు.

నేటి నుంచి సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు

ఉరవకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో బుధవారం నుంచి ఈ నెల8వ తేదీ వరకూ షష్ఠి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కృష్ణయ్య తెలిపారు. బుధవారం రక్షాబంధనం, కలశస్థాపన, 11కిలోల తేనెతో అభిషేకం, ధ్వజారోహణ కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 5న స్వామి వారికి పచ్చి టెంకాయల జలంతో అభిషేకం, లక్ష్మీనారాయణ స్వామి హోమం, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, 6న పాలతో రుద్రాభిషేకం, నాగమండలాధరణ, కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. 7న స్వామి వారి కల్యాణోత్సవం, సాయంత్రం గ్రామోత్సవం ఉంటుందన్నారు. 8న వసంతోత్సవం ధ్వజా అవరోహణ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుత్తిరూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక పోర్టు రైల్వే సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. మండలంలోని ఊబిచెర్ల గ్రామానికి చెందిన ప్రవీణ్ అనే యువకుడు బైక్‌పై గుత్తికి వచ్చి తిరిగి వెళ్తుండగా అదుపు తప్పి బోల్తా పడడంతో గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సజావుగా ఎన్నికలు నిర్వహించండి

బొమ్మనహాళ్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలు సజావుగా నిర్వహించాలని తహసీల్దార్ మునివేలు పేర్కొన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై పీఓలు, ఏపీఓలు, సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ నెల 5న నోటిఫికేషన్ విడుదలవుతుందని, 8న ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. సమావేశంలో ఎంఈఓ మల్లికార్జున, పశువైద్యాధికారి వెంకటరెడ్డి, హెచ్ఎల్సీ అధికారులు వెంకటరమణ, వెంకటరమణారెడ్డి, ముత్యాలప్ప పాల్గొన్నారు.

చర్మకారుల కార్యవర్గం ఏర్పాటు

గుత్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): చర్మకారుల సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో మంగళవారం చర్మకారుల సేవా సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఆ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జిగా లాలెప్ప, ఉపాధ్యక్షుడిగా మంజు, ప్రధాన కార్యదర్శిగా అడవి రాముడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజనప్రసాద్, నాయకులు చంద్రశేఖర్, కాశీం, రామాంజినేయులు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలాలను కాపాడాలి

ఉరవకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పంచాయతీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం సీపీఎం, కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఉరవకొండలో పంచాయతీ స్థలాలను ఆక్రమించుకుని అక్రమ కట్టడాలు చేపడుతున్నారన్నారు. విలువైన స్థలాలన్నీ ఆక్రమిస్తున్నా రెవెన్యూ, పంచాయతీ అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మధుసూదన్‌నాయుడు, కృష్ణమూర్తి, శ్రీనప్ప, కాంగ్రెస్ నాయకుడు ఓబులేష్ పాల్గొన్నారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోండి

పామిడి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు రబీ పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి లీనా వసుంధర పేర్కొన్నారు. మండలంలోని పి.కొండాపురం, రామరాజుపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటలకు వ్యాపించిన తెగుళ్లు, వాటి నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసరావు, ఎంపీఈఓ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ మృతి

బొమ్మనహాళ్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో సుశీలమ్మ(55) అనే అంగన్‌వాడీ వర్కర్ జ్వరంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ఆమెకు 15 రోజుల క్రితం జ్వరం వచ్చింది. స్థానిక ఆసుపత్రిలో చికిత్సల అనంతరం బళ్లారి ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో బెంగుళూరుకు తీసుకెళ్లారు. అక్కడా నయం కాకపోవడంతో కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు.

బదిలీ అధికారులకు సన్మానం


ఈఓఆర్‌డీని సత్కరిస్తున్న సర్పంచులు

యల్లనూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కార్యాలయంలో పనిచేస్తూ బదిలీ అయిన ఎంపీడీఓ వీరరాజు, ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడును మంగళవారం సర్పంచులు ఘనంగా సన్మానించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జడ్పీటీసీ సభ్యుడు భోగాతి ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ గంగాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా బదిలీ అయిన అధికారులు మాట్లాడుతూ మండలంలో పని చేయడం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అనంతరం సర్పంచులు అశోక్‌కుమార్‌రెడ్డి, వై.రామాంజులరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నారాయణస్వామి, నాగరాజు, ప్రభాకర్‌రెడ్డి, కుళ్లాయప్ప నాయుడు, పెద్దఓబులమ్మ, వనం శారద అధికారులను సన్మానించారు. వీరితోపాటు బదిలీ అయిన ఆరుగురు పంచాయతీ కార్యదర్శులను కూడా సన్మానించారు.

ఉపాధి హామీ సిబ్బంది దోపిడీ..!

● విడపనకల్లులో రూ.1.19 కోట్ల అవినీతి ● బయటి వ్యక్తుల పేరుతో జాబ్‌కార్డులు ● సామాజిక తనిఖీలో బయటపడిన అక్రమాలు


సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

విడపనకల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం సిబ్బంది, అధికారులు సరికొత్త మార్గంలో అవినీతి అక్రమాలకు తెర లేపారు. మండలంలో ఉపాధి హామీ పథకం 2023-24 సంవత్సరంలో జరిగిన పనులకు సంబంధించి మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీలో అనేక అవినీతి అక్రమాలు వెలుగుచూశాయి. మండలంలో మొత్తం రూ. 11 కోట్ల పనులు జరిగాయి. ఈ పనుల్లో రూ. 1.19 కోట్లు అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ అధికారులు తేల్చారు. డొనేకల్లు గ్రామం నుంచి ఆర్. కొట్టాల వరకూ కంకర రోడ్డు వేసినట్లు రికార్డులు చేశారు. కానీ అక్కడ పరిశీలిస్తే ఎక్కడా రోడ్డు వేయలేదని, రూ. 4.50 లక్షలు బిల్లు డ్రా చేశారని అధికారులు తెలిపారు. వేల్పుమడుగులో 60 మంది కూలీలకు సంతకాలు లేకుండానే బిల్లులు చేశారని, అంగన్‌వాడీ ఆయా 50 రోజులు పని చేసినట్లు రూ.12వేలు బిల్లు చేశారని వివరించారు. చెక్ మెజర్‌మెంట్స్‌లేవు, ఎంబుక్కుల్లో రికార్డులు లేవు, జాబ్ కార్డుల్లో సంతకాలు లేవని, రికార్డులు అసంపూర్తిగా ఉన్నాయని అధికారులు తేల్చారు.

పాల్తూరులో భారీ అక్రమాలు

పాల్తూరు ఒక్క గ్రామంలోనే రూ. 1కోటి 92వేల పనులు జరిగాయి. 17 పంచాయతీల్లో ఎక్కడా ఇంత మొత్తంలో పనులు జరగలేదు. ఈ గ్రామంలోనే రూ.28 లక్షలు అవినీతి జరిగింది. కంప్యూటర్ ఆపరేటర్ సుభాన్, జనార్దనపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ జానకిరాముడు, పాల్తూరు ఫీల్డ్‌అసిస్టెంట్ గురుస్వామి, అధికారులు కలిసి హైటెక్ అవినీతికి తెరలేపారు. పాల్తూరు పంచాయతీలో జరిగిన పనులకు ఎక్కడెక్కడో ఉన్న వారి పేర్లతో జాబ్ కార్డులు సృష్టించి డబ్బులు కాజేశారు. గ్రామంలో 35 మంది జగనన్న ఇళ్లు నిర్మించుకున్నారు. కానీ వేరేవారి అకౌంట్లకు రూ. 24 వేల చొప్పున జమచేశారు. ఇలా 35 ఇళ్లకు వేసిన బిల్లులు, వారి వివరాలను సామాజిక తనిఖీ అధికారులు గ్రామంలో విచారించగా ఆ పేర్లు ఉన్నవారు ఒక్కరు కూడా లేరని తెలిపారు. 76 జాబ్ కార్డులను వేరే ఊళ్ల వారి పేరుతో తయారు చేసి ఒక్కొక్కరికి రూ. 24 వేలు వేశారు. జాబ్ కార్డు క్రియేట్ చేయటం, బ్యాంకు అకౌంటుకు డబ్బులు వేసుకోవడం తర్వాత డిలీట్ చేయడం.. ఇలా మొత్తం అక్రమాలకు పాల్పడ్డారు. ప్రతి జాబ్ కార్డులోని వ్యక్తి 100 రోజులు పని చేసినట్లు రికార్డులు చేసి బిల్లులు వేసుకుని తర్వాత జాబ్ కార్డులు తొలగించారు. ఇలా జాబ్ కార్డుల ద్వారానే రూ. 12.18 లక్షలు డ్రాచేశారు. వివిధ పనుల ద్వారా రూ.15.63 లక్షలు డ్రా చేశారు. మొత్తం పాల్తూరు గ్రామంలోనే రూ. 27.81 లక్షలు అక్రమాలు చేశారు. సామాజిక తనిఖీ అధికారులు రికార్డులు అడిగితే కాలువలో కొట్టుకుపోయాయని సమాధానం ఇచ్చారు. కంప్యూటర్ ఆపరేటర్ సుభాన్, పాల్తూరు ఫీల్డ్ అసిస్టెంట్ గురుస్వామి పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. కంప్యూటర్ ఆపరేటర్ సుభాన్, జనార్దనపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ జానకిరాముడు ఇద్దరు కలిసి తనను మోసం చేసి బిల్లులు చేసుకున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని పాల్తూరు ఫీల్డ్ అసిస్టెంట్ గురుస్వామి అధికారులకు ఫిర్యాదు చేశారు. డ్వామా పీడీ సలీం బాషా మాట్లాడుతూ పాల్తూరులో జరిగిన అవినీతిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని, అందరిపై క్రిమినల్ కేసులను నమోదు చేయిస్తామన్నారు. అవినీతి విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సుధాకర్‌రెడ్డి, డీపీఓ రమణారెడ్డి, ఏపీడీ శైలజా, ఎస్ఆర్‌పీ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ షకీలాబేగం పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి గుంతకల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. స్థానిక పరిటాల శ్రీరాముల కల్యాణమండపంలో మంగళవారం గృహ నిర్మాణ శాఖ అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పలు శాఖలకు చెందిన అధికారులు వార్డుల్లో, గ్రామాల్లో చేపడుతున్న పనుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నడుముబిగించారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు అన్ని శాఖల అధికారులు అవగాహన కల్పించాలన్నారు. రాయదుర్గం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబును గుంతకల్లు నియోజకవర్గాన్ని అదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్, ఎంపీడీఓ శ్రీకాంత్‌చౌదరి, సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి, టీడీపీ గుంతకల్లు ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి, నాయకులు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, పత్తి హిమబిందు, మస్తానప్ప, వెంకటేష్, కదిరిప్ప, మల్లికార్జున పాల్గొన్నారు.

పెరుగుతున్న ధరలను నియంత్రించాలి: సీపీఎం


సమావేశంలో మాట్లాడుతున్న రాంభూపాల్

గుంతకల్లు టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న నిత్యావసర ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. పట్టణంలో సీఐటీయూ కాలనీలో మంగళవారం సీపీఎం పట్టణ 5వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూస్తున్న యువత నిరాశకు గురవుతున్నారని అన్నారు. డీఎస్సీ వాయిదా పడిందని, గ్రూప్-1, గ్రూప్-2 ఆగమ్యగోచరంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో మద్యం, ఇసుక మాఫియా పెరుగుతున్నాయని విమర్శించారు. ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.20వేల కోట్ల భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. వ్యవసాయ మోటర్లకు మీటర్లను బిగించాడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుల ఓ. నల్లప్ప, బి.శ్రీనివాసులు, మారుతిప్రసాద్, రమేష్, నాగరాజు, రంగమ్మ పాల్గొన్నారు.

ఉనికి కోసమే రంగయ్య విమర్శలు: టీడీపీ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కళ్యాణదుర్గం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సుమారు రూ. 70 కోట్లతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అభివృద్ధి చేస్తుంటే జీర్ణించుకోలేని వైసీపీ ఇన్‌చార్జ్ తలారి రంగయ్య ఉనికిని కాపాడుకోవడానికే విమర్శిస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్‌చౌదరి, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వైపీ రమేష్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీనారాయణ మండిపడ్డారు. మంగళవారం ప్రజావేదిక వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ ఇన్‌చార్జి పదవి పోతుందనే భయంతోనే రంగయ్య మాట్లాడుతున్నారన్నారు. ఐదేళ్లు ఎంపీగా ఉండి ఏమి అభివృద్ధి సాధించావో ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. వచ్చే రెండున్నరేళ్లల్లో బీటీపీ కాలువ పనులు పూర్తి చేసి సాగునీరు అందిస్తే రంగయ్య రాజకీయాల నుంచి తప్పుకుంటారా అని సవాల్ విసిరారు. మంత్రి ఉషశ్రీచరణ్ అక్రమాలు, అవినీతికి కేరాఫ్‌గా మారిపోయి కళ్యాణదుర్గంలో అభివృద్ధిని శూన్యంగా చేశారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు శ్రీరాములు, శివన్న, ధనుంజయ, తిప్పేస్వామి, రామరాజు, ఎర్రిస్వామి, తిప్పేస్వామి, కొల్లాపురప్ప, నగేష్ పాల్గొన్నారు.

సర్వే రాళ్లపై జగన్ ఫొటో తొలగింపు

కూడేరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): భూముల సరిహద్దు రాళ్లపై మాజీ ముఖ్యమంత్రి జగన్ ఫొటోలను అధికారులు తొలగించారు. వైసీపీ పాలనలో జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష కింద కూడేరు మండలంలో తిమ్మాపురం, ఎంఎం హళ్లి, చోళసముద్రం గ్రామాల్లో భూముల రీ సర్వే నిర్వహించి సర్వే రాళ్లపై జగన్ ఫొటోలు వేశారు. జగన్ ఫొటోలు తొలగించాలని ప్రభుత్వం ఆదేశించడంతో మంగళవారం కూడేరు మండలంలోని సర్వే అధికారులు పనులు వేగవంతం చేశారు. మండల సర్వేయర్ ఆయేషా సిద్దికి తోపాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.30 లక్షలు చెల్లించాలి

బెళుగుప్ప, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎకరాకు రూ.30 లక్షలతో కొనుగోలు చేస్తే తమ భూములు ఇస్తామని మండలంలోని నరసాపురం రైతులు స్పష్టం చేశారు. మండలం లోని నరసాపురం సమీపంలో రైల్వే స్టేషన్ నిర్మించడానికి అవసరమైన భూమి 19 ఎకరాలకు సేకరణకు అధికారులు చర్యలు తీసుకున్నారు. సేకరణ చేపట్టిన భూములను మంగళవారం ఆర్డీవో వసంతబాబు, జిల్లా సబ్ రిజిస్ట్రార్ భార్గవ్, తహసీల్దార్ షర్మిల పరిశీలించి రైతులతో చర్చించారు. ఎకరాకు రూ. 15 లక్షలు ప్రభుత్వం చెల్లిస్తుందని అధికారులు తెలుపగా మార్కెట్లో రూ. 30 లక్షలు ధర వుందని ఆ మేరకు చెల్లించాలని రైతులు కోరారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

గుత్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని కేంద్రీయ విద్యాలయం సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోబోల్తా పడి ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఉటకల్లు గ్రామానికి చెందిన కూలీలు రవి, చిన్నలాలెప్ప, మహమ్మద్ కలసి రజాపురం గ్రామంలో కూలీ పనుల కోసం ఆటోలు వెళ్తుండగా కేంద్రీయ విద్యాలయం సమీపంలో కుక్క అడ్డురావడంతో ఆటో బోల్తా పడింది. గాయపడిన బాధితులను ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. వీరిలో రవి, చిన్న లాలెప్ప పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురంకు తరలించారు.

కత్తితో దాడి.. ఇద్దరికి గాయాలు

తాడిపత్రి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని పెన్నానది పంప్‌హౌస్ వద్ద బోయ శీను, హాజీబాషాపై కత్తితో దాడిచేసి గాయపరిచారని రూరల్ పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన వేణు, గౌతం, బడే, మహమ్మద్‌తోపాటు మరికొంతమంది పంప్‌హౌస్ వద్ద మద్యం సేవిస్తుండగా.. అదే సమయంలో బోయ శ్రీనివాసులు, హాజీబాషా, అజయ్ ద్విచక్రవాహనంపై అక్కడికి మద్యం సేవించడానికి వెళ్లారు. పాతకక్షల కారణంగా అక్కడే మద్యం సేవిస్తున్న వేణు, గౌతం, మహమ్మద్, బడేతోపాటు మరికొంతమంది కలిసి వారిపై కత్తితో దాడిచేసి గాయపరిచారని పోలీసులు తెలిపారు. గాయపడ్డ వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో శ్రీనివాసులు పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

యాడికి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపాడు గ్రామంలో ఘర్షణకు సంబంధించి ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 11 మందిపై కేసు నమోదుచేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. గ్రామంలో సోమవారం అరుగు విషయంలో ఇరువర్గీయులు గొడవపడ్డారని తెలిపారు. దీనికి సంబంధించి ఇరువర్గాలపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

వరిపంటను పరిశీలించిన సీపీఐ నాయకులు

బొమ్మనహాళ్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో కురిసిన వర్షానికి నేలకొరిగిన వరిపంటను సీపీఐ తాలూకా కార్యదర్శి నాగార్జున, రైతు సంఘం నాయకులు తిప్పేస్వామి, నరసింహులు, తిప్పేస్వామి, కొట్రేష్ మంగళవారం పరిశీలించారు. మండలంలోని ఉంతకల్లుక్రాస్, దేవగిరిక్రాస్ గ్రామాలలో నేలకొరిగిన వరిపంటను పరిశీలించి ఆ రైతుల పరిస్థితులపై ఆరా తీశారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఐ నిరసన

గుంతకల్లుటౌన్/గుత్తి/బొమ్మనహాళ్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు జిల్లాలోని పలుచోట్ల నిరసనలు చేపట్టారు.


గుంతకల్లు ఏడీఏ కార్యాలయం వద్ద ధర్నానిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

గుంతకల్లులోని ఆలూరు రోడ్డులో ఏడీ కార్యాలయం వద్ద మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, మండల కార్యదర్శి రామురాయల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు పేరుతో వినియోగదారులపై భారం మోపుతోందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడ విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి.. అధికారంలోకి వచ్చిన తరువాత సర్దుబాటు చార్జీల పేరుతో పెను భారాన్ని మోపుతోందన్నారు. అనంతరం ఏడీఏ నాగేంద్రకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోపీనాథ్, ఈశ్వరయ్య, గురుస్వామి, గోవిందు, నాగరాజు, సూర్యనారాయణ పాల్గొన్నారు. గుత్తిలోని విద్యుత్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రామదాసు, రమేష్‌బాబు, మధుసూధన్‌రావు, నరసింహయ్య, వెంకటరాముడు పాల్గొన్నారు. బొమ్మనహాళ్ మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు ఆందోళన చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొట్రేష్, తిప్పేస్వామి, రామాంజినేయులు, ఒసికెర పాల్గొన్నారు.

సుబ్బరాయసాగర్ నుంచి నీరు విడుదల


నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

పుట్లూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బరాయసాగర్ నుంచి పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులకు హెచ్చెల్సీ నీటిని మంగళవారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ మేరకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు, ప్రజలకు తాగునీటిని అందిస్తున్నామని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యంతో కాలువలో పెద్దపెద్ద బండరాళ్లతో నిండిపోయిందన్నారు. వాటిని తీసివేయించడంతో డ్యామ్‌లోకి నీరు వచ్చిందన్నారు. నీటి సరఫరా ప్రవాహం 130 రోజులు ఒకేలా ఉండేవిధంగా అధికారులకు సూచించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, హెచ్చెల్సీ అధికారులు పాల్గొన్నారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి


కాలిన గడ్డివామిని పరిశీలిస్తున్న వెంకటశివుడుయాదవ్

పామిడి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని జి. కొట్టాల గ్రామంలో రైతు సుదర్శన్ గడ్డివాములను దగ్ధం చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన గడ్డివాములను పరిశీలించారు. అక్కజాంపల్లిలో టీడీపీ సీనియర్ నాయకుడు జంగం వెంకటస్వామి మృతి చెందడంతో నివాళుర్పించారు. మృతుడి కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆయనతో పాటు నాయకులు జంగం శంకర్, రమేష్, ఓబుళయ్య, రామాంజనేయులు, అరుణ్ ఉన్నారు.

టిడ్కో గృహాలను పరిశీలించిన ఎమ్మెల్యే


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని పుట్లూరు రోడ్డులో ఉన్న టిడ్కో గృహాలను మంగళవారం ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పరిశీలించారు. జనవరికి లబ్ధిదారులకు ఎన్ని ఇళ్లు ఇవ్వగలరని ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏయే సమస్యలు ఉన్నాయి, వాటిపైన వెంటనే నివేదికను తయారు చేయాలని అధికారులకు సూచించారు. ఆర్టీటీ కాలనీలో పర్యటించారు. రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాలనీలో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం వేయొద్దని సూచించారు. అవసరమైతే చెత్తసేకరణ వాహనాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కాలనీలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు లేవని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, టిడ్కో, హౌసింగ్ అధికారులు, నాయకులు నరేంద్రనాయుడు, ప్రసాద్‌నాయుడు, సోమశేఖర్‌నాయుడు, విజ్జి, మల్లికార్జున, రామకృష్ణ, అబ్దుల్, వాసు ఉన్నారు.

ఆసుపత్రిని తనిఖీ చేసిన మున్సిపల్ చైర్మన్


ఆర్ఎంఓతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో ఓపీ ఎక్కువగా ఉన్నందున వచ్చేవారికి ఇబ్బందికరంగా ఉందని, ఇలా అయితే ఎలా అని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక లైను ఏర్పాటు చేసి పద్ధతిగా ఓపీని ఇవ్వాలని, అవసరమైతే రెండో లైను ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రోగులు ఇలా ఎక్కడబడితే అక్కడ నిలుచోవడం, కింద కూర్చోవడం ఏమిటని వారిని ప్రశ్నించారు. కూర్చోవడానికి సీట్లు ఏర్పాటుచేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ కృష్ణవేణి, సూపరింటెండెంట్ డేవిడ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కూడేరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన ఓబుళపతి (53) అనే చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత నెల 24 న తిమ్మాపురం గ్రామానికి చెందిన ఓబుళపతి, సింగంపల్లికి చెందిన ఎగ్గిడి పోలన్న ద్విచక్ర వాహనంలో కూడేరుకు వస్తూ మార్గ మధ్యలో అదుపుతప్పి కిందపడ్డారు. తీవ్ర గాయాలైన ఓబుళపతి కర్నూలులో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు.

కుందుర్పమ్మకు బోనాలు

కుందుర్పి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బండమీదపల్లిలో వెలిసిన కుందిర్పమ్మకు మంగళవారం పెద్దఎత్తున భక్తులు బోనాలతో ఊరేగింపు చేపట్టారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వందలాది మంది మహిళలు బోనాలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేపట్టారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి గ్రామస్థులు పెద్దఎత్తున జాతరను నిర్వహిస్తారు.

జనన ధ్రువపత్రాల కోసం తిప్పలు

కళ్యాణదుర్గం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జనన ధ్రువ పత్రాల కోసం మున్సిపల్ అధికారులు ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. చెప్పిన సమయానికి మున్సిపల్ కార్యాలయానికి వస్తే ఇప్పుడు కాదు అప్పుడు.. మరో రోజు రావాలని హుకుం జారీ చేస్తున్నారు. ప్రశ్నిస్తే మరింత ఆలస్యం చేస్తున్నారు. అలా నెలల సర్టిఫికెట్ల కోసం కాళ్లరిగేలా మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లోపల రూ. వెయ్యి నుంచి రూ.మూడు వేలు దాకా వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

క్రీడానైపుణ్యాన్ని పెంపొందించాలి: ఎంఈవో

కుందుర్పి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో విద్యతో పాటు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించాలని ఎంఈఓ తిప్పేస్వామి పేర్కొన్నారు. మంగళవారం కదరంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. మహంతపురం, వడ్డీపాలెం, కెంచంపల్లి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శివలింగప్ప పాల్గొన్నారు.